E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 18-05-2026 (వారం) సోమవారం సంపుటి: 02 || సంచిక:135|| పేజీలు–6
www.ekaburu.com

భారత్‌కు చేరిన మరో ఎల్పీజీ నౌక 'సైమి'

బాలికలదే పైచేయి

ఎప్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన కె.కేశవరావు

ఇంజనీరింగ్ టాపర్ రుషి.. టాప్–10లో ఇద్దరు ఏపీ విద్యార్థులు

గతేడాది కన్నా పెరిగిన అర్హత... వారంలోనే ఫలితాల వెల్లడి

ఇంజనీరింగ్‌లో 73.36 శాతం, అగ్రికల్చర్, ఫార్మసీలో 86.27 శాతం మందికి అర్హత

ఈకబురు, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీసెట్)కు హాజరైన విద్యార్థుల్లో అత్యధిక మంది అర్హత సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన ఎం.రుషి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. మూసాపేటకు చెందిన అన్షుల్ రెండో స్థానంలో, ఆంధ్రప్రదేశ్ పులివెందులకు చెందిన ఎం.వంశీధర్ రెడ్డి మూడో స్థానం దక్కించుకున్నారు. ఇంజనీరింగ్‌లో 73.36 శాతం, అగ్రికల్చర్, ఫార్మసీలో 86.27% మంది ఉత్తీర్ణులయ్యారు. రెండు విభాగాల్లోనూ బాలికలదే పైచేయిగా ఉంది. ఈఏపీసెట్ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా మే 4 నుంచి 11 వరకూ సీబీటీ విధానంలో జరిగాయి. ఆదివారం ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. వి. బాలకిష్టారెడ్డి నేతృత్వంలో జేఎన్‌టీయూహెచ్ ప్రాంగణంలో పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో 2,10,766 మంది రిజిస్టర్ చేసుకోగా, 1,97,242 మంది పరీక్ష రాశారు. 1,44,704 మంది అర్హత సాధించారు. అగ్రి, ఫార్మా సెట్‌కు 90,977 మంది దరఖాస్తు చేస్తే, 84,954 మంది పరీక్ష రాశారు. వీరిలో 73,294 మంది అర్హత సాధించారు. ఇంజనీరింగ్‌లో బాలురు 84.70 శాతం మంది అర్హత సాధిస్తే, బాలికలు 86.76 శాతం ఉత్తీర్ణులయ్యారు.

మిగతా 2లో

3 గంటల్లో హైదరాబాద్-ముంబయి

మూడు రాష్ట్రాల్లో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టు

తెలంగాణలో 93 కిమీ.. కోకాపేట, వికారాబాద్‌లలో రైల్వే స్టేషన్లు

మహారాష్ట్ర పరిధిలో 3 ప్రాంతాల్లో 35 కిమీ మేర భూగర్భ మార్గం

స్టేషన్లు 12.. వేగం 300 కిమీ.. దూరం 671 కిమీ

సుతారపు సోమశేఖర్

ఈకబురు, హైదరాబాద్ నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరానికి ప్రస్తుతం రోడ్డు మార్గంలో అయితే సుమారు 12 గంటలు..రైల్లో అయితే దాదాపు 15 గంటల సమయం పడుతోంది. బుల్లెట్ రైల్లో గంటకు గరిష్ఠంగా 300 కిమీ వేగంతో కేవలం మూడు గంటల్లో చేరుకునేలా హైదరాబాద్‌పుణెముంబయి హైస్పీడ్ రైలు కారిడార్ ప్రణాళికలు తయారయ్యాయి. ఇప్పటికే సర్వే పూర్తి కాగా, తాజాగా డీపీఆర్ కూడా సిద్ధం అయిందని నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్) రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా తెలిపింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక బుల్లెట్ (హైస్పీడ్) రైల్లో హైదరాబాద్ నుంచి ముంబయికి కనిష్ఠంగా 2.55 గంటలు, గరిష్ఠంగా 3.13 గంటల్లో చేరుకోవచ్చని పేర్కొంది. ఈ ప్రాజెక్టులో మరో ఆసక్తికరమైన అంశం ఉంది. మహారాష్ట్ర పరిధిలోని మూడు ప్రాంతాల్లో మొత్తం 35.30 కిమీ మేర భూగర్భ మార్గం నిర్మిస్తారు. ఈ కారిడార్‌లోని ఖండాల ఘాట్ ప్రాంతంలో మొత్తం 13 చోట్ల కొండల్ని తొలిచి సొరంగాల నిర్మాణం చేపడతారు. మొత్తం దూరం 24 కిలోమీటర్లు. హైదరాబాద్‌లో మెట్రో రైలు కోసం పిల్లర్లపై నిర్మించిన ట్రాక్ మాదిరిగా హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మాణం ఉంటుంది. కొండ ప్రాంతాలు, భూగర్భంలో, నదుల మీదుగా నిర్మాణానికి ప్రతిపాదించిన ఈ హైస్పీడ్ రైలు కారిడార్‌లో అనేక విశేషాలున్నాయి.

మిగతా 2లో

కేరళ సీఎంగా నేడు సతీశన్ ప్రమాణం

మంత్రులుగా 20 మంది ప్రమాణం

తిరువనంతపురంలో భారీగా ఏర్పాట్లు

ఈకబురు, తిరువనంతపురం: కేరళలో దశాబ్దకాలంపాటు అధికారానికి దూరమైన కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి నేడు నూతన ప్రభుత్వాన్ని కొలువుతీర్చనుంది. ఇందులోభాగంగా కేరళ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. సోమవారం ఉదయం 10 గంటలకు తిరువనంతపురంలోకి సెంట్రల్ స్టేడియంలో సతీశన్‌తోపాటు 20 మంది నేతలు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేతలు, ప్రముఖులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యే అవకాశముండటంతో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాబోయే సీఎం సతీశన్ శనివారం సాయంత్రం రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కలిసి మంత్రివర్గం జాబితాను అందజేశారు. నేడు జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా వాద్రా హాజరు కానున్నారు.

సహకారమే మన బలం

కీలక రంగాల్లో పరస్పరం సహకరించుకుందాం

భారత ప్రధాని మోదీ, స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్‌సన్ నిర్ణయం

బంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచాలని నిర్ణయం

ఈ-కబురు, గోథెన్‌బర్గ్:
సహకారమే మన బలమని భారత ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మోదీ ఆదివారం స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టర్‌సన్‌తో సమావేశమ్యారు. ఇరుదేశాల మధ్య సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలని ఈ సందర్భంగా ఇరుదేశాలు అంగీకరించాయి. భారత్ - ఈయూ వ్యూహాత్మక భాగస్వామ్యం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం స్ఫూర్తితో తమ ప్రజల ప్రయోజనం కోసం కొత్త అవకాశాలను అన్వేషించాలని నిర్ణయించారు.

మిగతా 3లో

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాలి

కాంగ్రెస్, భాజపా.. బాలికకు అన్యాయం చేయాలని చూశాయి

వచ్చే మా ప్రభుత్వంలో నగరంలో 24 గంటలూ తాగునీటి సరఫరా: కేటీఆర్

ఈకబురు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. వేధింపులకు గురైన బాలికకు కాంగ్రెస్, భాజపాలు కలిసి అన్యాయం చేయాలని చూశాయని ఆరోపించారు. హైదరాబాద్ ఎల్బీనగర్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన 'నా బూత్.. నా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'బాలికకు అన్యాయం జరిగితే ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ఆమెకు న్యాయం చేసేందుకు భారాస పోరాడింది

మిగతా 2లో

రావెలకు సమీపంలో

అమరావతి అంతర్జాతీయ విమానాశ్రయం

ఈ–కబురు, అమరావతి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయాలు, ఆలోచనలు ఎవరికి అందనంత ఎత్తులో ఉంటాయని ఆయన శత్రువులు కూడా అంటుంటారు. ఒక నిర్ణయం తీసుకుంటే అది ఇప్పటి అవసరాలకు అనుగుణంగానే కాక భవిష్యత్ తరాలు కూడా అపురూపంగా చెప్పుకునే విధంగా ముందుచూపుతో ఆయన వ్యవహరిస్తుంటారు. అమరావతి చరిత్రాత్మక రాజధాని నిర్మాణం జరుగుతున్న సమయంలోనే దానికి అదనపు హంగులు కల్పించడానికి రకరకాల నిర్ణయాలు తీసుకుని వాటిని వెనువెంటనే ఆచరణలోకి తెస్తుండడంతో సగటు ఆంధ్రుడు భవిష్యత్‌పై భరోసాతో ఉన్నారు. దీనికి అనుగుణంగానే అమరావతిలో ప్రతిష్టాత్మక ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని సంకల్పించడమే తడవుగా భూసేకరణకు కూడా నడుం బిగించారు. దీనికోసం సమర్థులైన అధికారులకు ఈ బాధ్యత అప్పగించడంతో త్వరలోనే ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అంకురార్పణ జరుగనుంది.

02

త్రిభాషా తకరారు

సీబీఎస్‌ఈ త్రిభాషా సూత్రంపై ఆందోళన

ఇప్పటికే ప్రారంభమైన విద్యా సంవత్సరం

హఠాత్తుగా కొత్త విధానం

వద్దంటున్న విద్యావేత్తలు

పునరాలోచన చేయాలని సీబీఎస్‌ఈకి వినతి

ఈకబురు, 2026-27 విద్యా సంవత్సరంలో తొమ్మిదవ తరగతి విద్యార్థులు తప్పనిసరిగా మూడు భాషలు అభ్యసించాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) ప్రకటించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

మిగతా 3లో

టిఆర్ఎస్ లో భారీ చేరికలు

02

ఆర్సీబీ అదుగేసింది

డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈ ఐపీఎల్‌లోనూ అద్భుత ఆటతీరుతో ఆకట్టుకుంటోంది. ఈసారి ప్లేఆఫ్స్ చేరిన తొలి జట్టుగా ఆర్సీబీ నిలిచింది. హ్యాట్రిక్ విజయం నమోదు చేసిన బెంగళూరు

బాలికలదే పైచేయి

ఇంజనీరింగ్‌లో 73.36 శాతం, అగ్రికల్చర్, ఫార్మసీలో 86.27% మంది ఉత్తీర్ణులయ్యారు. రెండు విభాగాల్లోనూ బాలికలదే పైచేయిగా ఉంది. ఈఏపీసెట్ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా మే 4 నుంచి 11 వరకూ సీబీటీ విధానంలో జరిగాయి. ఆదివారం ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. వి. బాలకిష్టారెడ్డి నేతృత్వంలో జేఎన్‌టీయూహెచ్ ప్రాంగణంలో పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో 2,10,766 మంది రిజిస్టర్ చేసుకోగా, 1,97,242 మంది పరీక్ష రాశారు. 1,44,704 మంది అర్హత సాధించారు. అగ్రి, ఫార్మా సెట్‌కు 90,977 మంది దరఖాస్తు చేస్తే, 84,954 మంది పరీక్ష రాశారు. వీరిలో 73,294 మంది అర్హత సాధించారు. ఇంజనీరింగ్‌లో బాలురు 84.70 శాతం మంది అర్హత సాధిస్తే, బాలికలు 86.76 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ ప్రొ. టీకే రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొ.వెంకటేశ్వరరావు, మండలి వైస్ చైర్మన్లు ప్రొ. ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమ్మూద్ పాల్గొన్నారు.

వారంలో కౌన్సెలింగ్ షెడ్యూల్

ఎప్‌సెట్ ఫలితాలు వెల్లడవ్వడంతో కాలేజీల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను ఈ నెలాఖరు నుంచి మొదలు పెడుతున్నట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.16 లక్షల ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో 70 శాతం సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. మిగతా సీట్లను యాజమాన్య కోటాలో భర్తీ చేస్తారు. ఏపీ విద్యార్థులు టాపర్లుగా నిలిచినప్పటికీ కౌన్సెలింగ్‌లో వారికి అవకాశం లేదని అధికార వర్గాలు తెలిపాయి.

కన్వీనర్ అసలు హీరో

కేవలం వారం రోజుల్లోనే ఎప్‌సెట్ ఫలితాలు విడుదల చేయడం మామూలు విషయం కాదని ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు అన్నారు. అదీ ఎలాంటి చిన్న పొరపాట్లు లేకుండా, ఎలాంటి సమస్యలు రాకుండా ప్రశాంతంగా ఫలితాలు వెల్లడించడం అభినందనీయమన్నారు. పరీక్షల్లో ర్యాంకులు తెచ్చుకున్న విద్యార్థులే కాదు... సెట్ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి కూడా హీరోనే అని కొనియాడారు.

3 గంటల్లో హైదరాబాద్-ముంబయి

కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాల పరిధిలో 7 హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టుల్ని ప్రకటించగా.. ఇందులో 3 హైదరాబాద్ నుంచి ఉన్నాయి. హైదరాబాద్‌చెన్నై, హైదరాబాద్‌బెంగళూరు సర్వే దశలో ఉండగా హైదరాబాద్‌పుణెముంబయి ప్రాజెక్టు సర్వే పూర్తి కావడంతోపాటు డీపీఆర్‌ను సైతం ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్ సిద్ధం చేసింది. ఈ కారిడార్ మొత్తం దూరం 671 కిమీ. ఇందులో 93 కిమీ (14 శాతం)తెలంగాణలో, 121 కిమీ (18 శాతం) కర్ణాటకలో, అత్యధికంగా 457 కిమీ (68 శాతం) మహారాష్ట్రలో ఉంటుంది.

రైలు ఆగే స్టేషన్లు..

తెలంగాణలో: వికారాబాద్, హైదరాబాద్ (కోకాపేట)

కర్ణాటకలో: కలబురగి

మహారాష్ట్రలో: విక్రోలి, థానే, నవీ ముంబయి, లోనావాలా, పింప్రిచించ్వాడ్, పుణె, బారామతి, పంఢర్‌పుర్, సోలాపుర్

ఒక్కో స్టేషన్‌కు 247 ఎకరాలు...

బుల్లెట్ రైళ్ల పరుగులో వేగమే కాదు..అవి ఆగే స్టేషన్లలోనూ ప్రత్యేకత ఉండనుంది. సాధారణ స్టేషన్ల మాదిరి కాకుండా అంతర్జాతీయ ప్రమాణాల్లో ఈ రైల్వేస్టేషన్లను నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. ఒక్కో స్టేషన్ ప్రాంగణానికి భవన నిర్మాణం, పార్కింగ్ ఇతర సదుపాయాల కోసం 247 ఎకరాల భూమి అవసరం అవుతుందని అంచనా వేశారు. పెద్దఎత్తున భూమి కావాలని ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇటీవల తొలుత రోడ్లుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తాజాగా సీఎస్ రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ (రవాణా, ఆర్‌అండ్‌బీ) వికాస్‌రాజ్‌తో ఆ సంస్థ అధికారులు సమావేశమైన సందర్భంలో ఈ ప్రాజెక్టు విశేషాలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారం గురించి వివరించారు. రాష్ట్రంలో తొలుత కోకాపేట, వికారాబాద్‌లలో హైస్పీడ్ స్టేషన్లను గుర్తించగా..తాజాగా శంషాబాద్ చేరింది. స్టేషన్ నిర్మించే ప్రాంతాన్ని గుర్తించాల్సి ఉంది. మొత్తంగా ఎయిర్‌పోర్ట్ సమీపంలోనే ఉంటుంది. వికారాబాద్, కోకాపేట స్టేషన్ల నిర్మాణాలు, ప్రాంగణాలకు మొత్తం 247 ఎకరాలు కావాలని ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. డిపో కోసం భారీగా భూమి కావాలని అడిగింది.

నదులపై భారీ వంతెనలు..

ఈ ప్రాజెక్టు మార్గంలో మొత్తం 101 వంతెనలను నిర్మించనున్నారు. ఇందులో 13 స్టీల్ వంతెనలు ఉంటాయి. ప్రధాన నదులపై 29 భారీ వంతెనలు ప్రతిపాదించారు. ములాముఠా నదిపై 360 మీటర్ల పొడవైన వంతెన..భీమా నదిపై 280 మీటర్ల వంతెన, బోరి నదిపై 225 మీటర్ల వంతెన నిర్మిస్తారు.

ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్యపైన అంచనాలు రూపొందించారు. ప్రారంభ సంవత్సరంలో రోజుకు 63,494 మంది..2041 నాటికి 95,050.. 2051కి 1,22,727.. 2061 నాటికి 1,52,092 మంది ప్రయాణిస్తారని అంచనా. వికారాబాద్ హైస్పీడ్ రైలు స్టేషన్‌కు 2.3 కిమీ దూరంలో రైల్వే స్టేషన్, 3 కిమీ దూరంలో వికారాబాద్ పట్టణం ఉన్నాయి. ప్రతిపాదిత స్టేషన్ ప్రాంతం భూమి ప్రైవేటుది.

కోకాపేట హైస్పీడ్ రైలు స్టేషన్‌కు ప్రతిపాదిత మెట్రో రైలు స్టేషన్ (కోకాపేట నియోపోలిస్) 0.5 కిమీ దూరంలో, ఔటర్ రింగ్‌రోడ్ కేవలం 0.01 కిమీ దూరంలో, లింగంపల్లి రైల్వేస్టేషన్ 13 కిమీ దూరంలో ఉన్నాయి. ప్రతిపాదిత స్టేషన్ ప్రాంతం భూమి కొంత ప్రైవేటుది, కొంత ప్రభుత్వానిది.

ఒక్కో రైల్లో 16 బోగీలు, 1,215 మంది ప్రయాణికులు

ఒక్కో బుల్లెట్ రైల్లో 16 బోగీలు ఉంటాయి. ఒకేసారి మొత్తం 1,215 మంది ప్రయాణించే సామర్థ్యంతో సీట్లు ఉంటాయి. ప్రాజెక్టు ఆపరేషన్ కోసం మహారాష్ట్రలోని థానేలో ఒక భారీ బుల్లెట్ రైళ్ల డిపో, వర్‌క్‌షాప్‌ను..హైదరాబాద్‌లో మరో డిపోను ఏర్పాటు చేస్తారు. ముంబయిలో ఆపరేషన్ కంట్రోల్ సెంటర్‌ను ప్రతిపాదించారు

టిఆర్ఎస్ లో భారీ చేరికలు

బోథ్, ఖైరతాబాద్, అంబర్ పేట్, నర్సాపూర్ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున చేరిన నాయకులు

కండువా కప్పి ఆహ్వానించిన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత

ఈకబురు, హైదరాబాద్ :

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరారు. ఆదివారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆధ్వర్యంలో 200 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్ లో చేరారు. సీనియర్ నాయకుడు మతిన్ అధ్వర్యంలో అంబర్ పేట్ నియోజకవర్గానికి చెందిన ముస్లిం మహిళలు టీఆర్ఎస్ లో చేరారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి నర్సింహ తన అనుచరులతో కలిసి టీఆర్ఎస్ లో చేరారు. నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు యువకులు టీఆర్ఎస్ లో చేరారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాలి

ఈకబురు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. వేధింపులకు గురైన బాలికకు కాంగ్రెస్, భాజపాలు కలిసి అన్యాయం చేయాలని చూశాయని ఆరోపించారు. హైదరాబాద్ ఎల్బీనగర్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన 'నా బూత్.. నా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'బాలికకు అన్యాయం జరిగితే ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ఆమెకు న్యాయం చేసేందుకు భారాస పోరాడింది. ప్రధాన మంత్రి బేటీ బచావో.. బేటీ పఢావో అంటున్నారే తప్ప బాలికకు న్యాయం చేయడం లేదు. కేంద్ర మంత్రి కుమారుడికే లుకౌట్ నోటీసులు ఇచ్చే పరిస్థితి ఏర్పడింది. బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయకుంటే విచారణ సరిగా జరగదు. బాలిక తల్లిదండ్రులను పిలిచి ఆయన బెదిరింపులకు పాల్పడ్డారు. ఎన్ని రకాలుగా ఒత్తిళ్లకు గురిచేసినా అమ్మాయికి న్యాయం చేయాలని ఆమె తల్లిదండ్రులు చేసిన పోరాటం గొప్పది. ఇంత తీవ్రమైన కేసును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీరుగార్చే ప్రయత్నం చేశారు. నగరంలో నలువైపులా టిమ్స్ ఆసుపత్రులను నిర్మించింది భారాస ప్రభుత్వమే. ఇప్పటి వరకు ఎల్బీనగర్‌లో టిమ్స్ నిర్మాణం పూర్తి కాలేదు. దాని ముందు ధర్నా చేస్తాం. 2028లో వచ్చే భారాస ప్రభుత్వం నగరంలో ఇంటింటికీ 24 గంటలూ తాగునీరు సరఫరా చేస్తుంది. జూన్‌లో సభ్యత్వ నమోదు, జులైలో డివిజన్ కమిటీలు ఏర్పాటు చేస్తాం. 'సర్'లో బిహార్‌లో 60 లక్షలు, పశ్చిమబెంగాల్‌లో కోటి మంది ఓటర్లను తొలగించారు. నగరంలో మైనారిటీ ఓటర్లకు పార్టీ శ్రేణులు అండగా ఉండాలి' అని కేటీఆర్ సూచించారు. సమావేశంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాజయ్య, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

రావెలకు సమీపంలో అమరావతి అంతర్జాతీయ విమానాశ్రయం

తాడికొండ మండలం రావెల సమీపంలో ప్రతిపాదించారనే వార్తలు ఇపుడు చక్కర్లు కొడుతున్నాయి. ప్రభుత్వం ప్రతిపాతదించిన రోడ్ మ్యాప్ ప్రకారం ఈ విమానాశ్రయం విజయవాడకు దక్షిణ దిశలో సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉండనుందని మ్యాప్‌ను బట్టి తెలుస్తోంది. మొత్తం 5 వేల ఎకరాల్లో 4,618 ఎకరాలను ప్రపంచ స్థాయి సదుపాయాలతో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసేందుకు వినియోగిస్తారు.మరో 380 ఎకరాలను పార్కింగ్ సదుపాయం కోసం కేటాయించనున్నారు. రాజధాని అమరావతి, గుంటూరు, విజయవాడ నగరాలకు అనుసంధానం దృష్ట్యా విమానాశ్రయ నిర్మాణం కోసం.. రావెల ప్రాంతాన్ని ఎంపిక చేయనున్నట్లు అధికారులు అంటున్నారు.రాజధాని అమరావతిలో.. ప్రతిపాదిత ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఈ విమానాశ్రయం ఉండ నుంది.ప్రస్తుత సచివాలయం నుంచి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కాగా.. ఈ విమానాశ్రయ నిర్మాణాన్ని పూర్తిగా కేంద్రమే చేపట్టనుందని అంటున్నారు. రెండు దశల్లో నిర్మించే ఈ విమానాశ్రయాన్ని తొలి దశలో 3400 కోట్ల రూపాయలతో చేపట్టనున్నారు. ప్రస్తుతం భూ సేకరణ జరుగుతోంది. కొందరు రైతులు కోర్టుకు వెళ్లడంతో ఈ ప్రక్రియకు కొంత విరామం లభించినట్టు అయింది. యయఅమరావతి అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి భారీ ప్రణాళికే వేయనున్నారు. బోయింగ్ 777 విమానాలు దిగేలా డిజైన్ చేస్తున్నారు. రాబోయే 60 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా 5 దశల్లో విస్తరణ ప్రణాళిక రూపొందించినట్టు అధికారులు తెలిపారు. వచ్చే పదేళ్లలో 60 లక్షల మంది ప్రయాణికు లు ఈ విమానాశ్రయం ద్వారా సేవలు పొందుతారని అంచనా వేస్తున్నారు. చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా ఈ ఎయిర్‌పోర్ట్ రూపుదిద్దుకోనుంది. తెలంగాణాలో శంషాబాద్ విమానాశ్రయం నిర్మించిన అనుభవంతో అంతకు పదిరెట్లు మెరుగైన ఆధునిక సౌకర్యాలతో అమరావతి అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కంకణబద్ధులై ఉన్నారు.

భారత్‌కు చేరిన మరో ఎల్పీజీ నౌక 'సైమి'

ఈకబురు: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో దేశంలో ఇంధన సరఫరాపై ఆందోళన నెలకొంది. ఈ తరుణంలో ఎల్పీజీని తీసుకొస్తున్న మరో భారత నౌక 'సైమి' హర్ముజ్‌ను దాటి సురక్షితంగా భారత్‌కు చేరింది. ఆదివారం గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు చేరిన ఈ ట్యాంకర్‌లో సుమారు 20,000 టన్నుల ఎల్పీజీ గ్యాస్ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఖతార్‌లోని రాస్ లఫాన్ టెర్మినల్ నుంచి బయల్దేరిన ఈ క్యారియర్.. మే 13న హర్ముజ్‌ను దాటింది. మరో నౌక 'సన్‌షైన్' గురువారం హర్ముజ్‌ను దాటిందని.. 46,427 టన్నుల ఎల్పీజీతో సోమవారం నాటికి న్యూ మంగళూరు పోర్టుకు చేరుకుంటుందని నౌకాయాన శాఖ వెల్లడించింది. ఈ రెండు నౌకల్లోని వంటగ్యాస్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందినదని అధికారులు తెలిపారు. హర్ముజ్‌పై ఆంక్షలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు జల సంధిని దాటిన భారత నౌకల సంఖ్య 13కు చేరింది. మరోవైపు భారత్‌కు ఇంధనం రవాణా చేస్తున్న మరో 12నౌకలు గల్ఫ్‌లోనే చిక్కుకుపోయాయని పేర్కొన్నారు.

కేరళ సీఎంగా నేడు సతీశన్ ప్రమాణం

ఈకబురు, తిరువనంతపురం: కేరళలో దశాబ్ద కాలంపాటు అధికారానికి దూరమైన కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి నేడు నూతన ప్రభుత్వాన్ని కొలువుతీర్చనుంది. ఇందులోభాగంగా కేరళ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. సోమవారం ఉదయం 10 గంటలకు తిరువనంతపురంలోకి సెంట్రల్ స్టేడియంలో సతీశన్‌తోపాటు 20 మంది నేతలు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేతలు, ప్రముఖులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యే అవకాశముండటంతో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాబోయే సీఎం సతీశన్ శనివారం సాయంత్రం రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కలిసి మంత్రివర్గం జాబితాను అందజేశారు. నేడు జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, నేతలు రాహుల్ గాం□దీ, ప్రియాంకా వాద్రా హాజరు కానున్నారు.

కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులూ ఈ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరుకానున్నారు. తమిళనాడు సీఎం విజయ్ జోసెఫ్ వచ్చే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. తన మంత్రివర్గంలో సీనియర్ నేతలు రమేశ్ చెన్నితాల, కె. మురళీధరన్, కేపీసీసీ చీఫ్ సన్నీ జోసెఫ్, ఏపీ అనిల్ ఉంటారని కాబోయే సీఎం సతీశన్ చెప్పారు. దీంతో, సీఎం కుర్చీ కోసం పోటీ పడిన చెన్నితాల కేబినెట్‌లో చేరే అవకాశం లేదంటూ వచ్చిన వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. ఈసారి కేబినెట్‌లోకి 14 మంది కొత్తముఖాలకు అవకాశం కల్పించనున్నారు. అసెంబ్లీ స్పీకర్ పోస్టుకు మరో సీనియర్ నేత టి.రాధాకృష్ణన్‌ను ఎంపిక చేసినట్లు సతీశన్ చెప్పారు. ఐయూఎంఎల్ నేతలు పీకే కున్హలికుట్టి, ఎన్.షంషుద్దీన్, కేఎం షాజీ, పీకే భాస్కర్, వీఈ అబ్దుల్ గఫూర్, ఆర్ఎస్‌పీ నేత శిబూ బేబీ జాన్, కేరళ కాంగ్రెస్ నేత మోన్స్ జోసెఫ్, కేరళ కాంగ్రెస్(జాకబ్) నేత అనూప్ జాకబ్‌లకూ కేబినెట్ బెర్త్ ఖారారైంది.

సీఎంగా సతీశన్ బాధ్యతలు చేపట్టక మునుపే మంత్రి పదవులకు ఎంపిక, అధికార పంపిణీ, అధిష్టానం నిర్ణయాలపై అంతర్గత అసమ్మతి రగులుతోంది. సీఎంగా సతీశన్‌ను ఎంపిక చేయడం వెనుక కూటమి భాగస్వామ్య పక్షం ఐయూఎంఎల్ ఒతిళ్లున్నాయని నాయర్ సేమా సమాజం(ఎన్ఎస్ఎస్) ప్రధాన కార్యదర్శి సుకుమారన్ ఆరోపించారు. కూటమిలో ఎస్ఎన్‌డీపీ ప్రధాన కార్యదర్శి వెల్లప్పల్లి నటేశన్ సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కూటమికి చెందిన స్వతంత్ర ఎమ్మెల్యే మణి కప్పన్ సంతృప్తిని బహిరంగంగా వెళ్లగక్కారు. కేబినెట్ కూర్పులో రొటేషన్ విధానాన్ని ప్రతిపాదించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

కోర్టు స్టే ఉన్న భూముల్లో నిర్మాణాలు ఆపాలి

కొల్లూర్ లక్ష్మీపురం కాలనీ వాసుల డిమాండ్

ఈ–కబురు, పటాన్‌చెరు :
వివాదాస్పద సర్వే నంబర్ల విషయంలో సుప్రీంకోర్టు స్టే ఇచ్చినా అక్కడ నిర్మాణాలు సాగుతున్నాయని వెంటనే వాటిని ఆపాలని కొల్లూర్ లక్ష్మీపురం కాలనీ వాసులు అధికారులను డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ పరిధిలోని కొల్లూర్ లక్ష్మీపురం లేఅవుట్ వద్ద ప్లాట్ ఓనర్లు ఆదివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహ మూర్తి మాట్లాడుతూ 1984 లో కొల్లూర్‌లోని లక్ష్మీపురం లేఅవుట్‌లో 1500 మంది ప్లాట్లు కొనుగోలు చేశారని తెలిపారు. 2003 నుండి నాదేండ్ల ఎస్టేట్ , మరి కొంతమందితో లేఅవుట్ భూములు విషయంలో సమస్యలు వచ్చాయని, అప్పటినుండి సర్వే నంబర్లు 174, 175, 177, 180, 181, 187 నుండి 190 వరకు ఉన్న భూములపై సుప్రీంకోర్టు స్టే అమలవుతోందని పేర్కొన్నారు. లోకాయుక్తా, కోర్టుల్లో ప్లాట్ ఓనర్లకు అనుకూలంగా తీర్పులు వచ్చాయని కానీ కొంతమంది తప్పుడు పత్రాలు సృష్టించి తమ ప్లాట్ల లోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, గుండాల సహకారంతో తమ ప్లాట్లను కాజేసేందుకు కొంతమంది బడాబాబులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల కోర్టు నిబంధనలకు విరుద్ధంగా సర్వే నంబర్ 188 లో కొన్ని నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, వెంటనే వాటిని అధికారులు అడ్డుకోవాలని కోరారు. వివాదాస్పద భూముల విషయం పరిష్కారం అయ్యే దాక అక్కడ నిర్మాణాలు జరగకుండా హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులు చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మల్లేశ్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేకరులతో మాట్లాడుతున్న కొల్లూర్ లక్ష్మీపురం ఓనర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

నిర్మాణ భూములకు.. లేఅవుట్‌తో సంబంధం లేదు : వీఎల్ఎస్ ప్రసాద్
కొల్లూర్ సర్వే నంబర్ 188/ఏఏ భూములకు.. లక్ష్మీపురం లేఅవుట్ భూములకు ఎలాంటి సంబంధం లేదని, కోర్టు స్టే సర్వే నంబర్ 188 పార్ట్‌కు వర్తించదని వీఎల్ఎస్ ప్రసాద్ స్పష్టం చేశారు.
సర్వే నంబర్ 188 లోని మొత్తం భూమిని లక్ష్మీపురం లేఅవుట్‌కు ఇవ్వలేదని, అందులోని పట్టాదారుల నుండి మూడెకరాల భూమిని న్యాయబద్ధంగా కొనుగోలు చేశానని ప్రసాద్ వివరించారు. నిర్మాణాలకు సంబంధించి రెరా, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అన్ని శాఖల నుండి అనుమతులు పొందినట్లు తెలిపారు. లక్ష్మీపురం లేఅవుట్ భూములు వివాదాస్పదంగా మారిన విషయం వాస్తవమేనని, కానీ తానెక్కడా ప్లాట్ యజమానులను మోసం చేయలేదని అన్నారు. చట్ట ప్రకారం అన్ని విచారణలకు సిద్ధమని చెప్పారు.

సహకారమే మన బలం

ఈకబురు, గోథెన్‌బర్గ్: సహకారమే మన బలమని భారత ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మోదీ ఆదివారం స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టర్‌సన్‌తో సమావేశమ్యారు. ఇరుదేశాల మధ్య సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలని ఈ సందర్భంగా ఇరుదేశాలు అంగీకరించాయి. భారత్-ఈయూ వ్యూహాత్మక భాగస్వామ్యం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం స్ఫూర్తితో తమ ప్రజల ప్రయోజనం కోసం కొత్త అవకాశాలను అన్వేషించాలని నిర్ణయించారు. వ్యాపారం, వాణిజ్యం, టెక్నాలజీ, రక్షణ సహా కీలక రంగాల్లో పరస్పర సహకారంపై సంప్రదింపులు జరిపారు. సహకారమే మన బలమని ఉద్ఘాటించారు. రెండో రోజుల పర్యటన నిమిత్తం నెదర్లాండ్స్ నుంచి ఆదివారం ఉదయం స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్‌కు చేరుకున్న మోదీకి ఘనస్వాగతం లభించింది. మోదీ గౌరవార్థం ఆయన ప్రయాణించిన విమానానికి స్వీడన్ ఎయిర్‌పోర్స్ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి.
గోథెన్‌బర్గ్ ఎయిర్‌పోర్టులో మోదీకి స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్‌సన్ సాదర స్వాగతం పలికారు. మోదీకి స్వాగతం పలకడానికి స్వీడన్‌లోని ప్రవాస భారతీయులు తరలివచ్చారు. మోదీ రాకను పురస్కరించుకొని నిర్వహించిన సంగీత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం మోదీ, క్రిస్టర్‌సన్ మధ్య ప్రతినిధుల స్థాయి భేటీ జరిగింది. ఇరు పక్షాలు ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షించారు.

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంపొందించడానికి అందుబాటులో ఉన్న నూతన మార్గాలపై చర్చించారు. హరిత పరివర్తన, కృత్రిమ మేధ (ఏఐ), వర్ధమాన సాంకేతికతలు, స్టార్టప్‌లు, సప్లై చైన్లు, రక్షణ, అంతరిక్షం, వాతావరణ చర్యలు సహా ప్రజల మధ్య సంబంధాల విషయంలో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై భారత్, నెదర్లాండ్స్ ప్రత్యేకంగా దృష్టి సారించాయి.
ప్రధాని మోదీకి 'పోలార్ స్టార్' గౌరవం
ప్రధాని మోదీ స్వీడన్ అత్యున్నత పురస్కారం 'రాయల్ ఆర్డర్ ఆఫ్ పోలార్ స్టార్, డిగ్రీ కమాండర్ గ్రాండ్ క్రాస్' అందుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి చేసిన కృషి, దూరదృష్టి కలిగిన నాయకత్వానికి గుర్తింపుగా ఈ పురస్కారం అందజేసినట్లు స్వీడన్ యువరాణి విక్టోరియా ప్రకటించారని విదేశాంగ శాఖ తెలిపింది.
భారత్, నెదర్లాండ్స్ మధ్య ఇక వ్యూహాత్మక భాగస్వామ్యం
ద హేగ్: అంతర్జాతీయ భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో భారత్, నెదర్లాండ్స్ దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లాయి. ఇకపై ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం నెదర్లాండ్స్‌లో పర్యటించారు. ఆ దేశ ప్రధానమంత్రి రోబ్ జెటెన్‌తో సమావేశమయ్యారు. ఇరుదేశాలు మధ్య ద్వైపాక్షిక

సంబంధాలపై విస్తృతంగా చర్చించారు.
ఈ సందర్భంగా రక్షణ, అరుదైన ఖనిజాలు సహా కీలక రంగాల్లో పరస్పర సహకారం కోసం 17 ఒప్పందాలపై భారత్, నెదర్లాండ్స్ సంతకాలు చేశాయి. పశ్చిమాసియా పరిణామాలపై ఇద్దరు ప్రధానమంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన సరఫరాలో అంతరాయాల వల్ల ప్రపంచదేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వెల్లడించారు. భేటీ తర్వాత వారిద్దరూ ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.

త్రిభాషా తకరారు

ఈకబురు,2026-27 విద్యా సంవత్సరంలో తొమ్మిదవ తరగతి విద్యార్థులు తప్పనిసరిగా మూడు భాషలు అభ్యసించాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) ప్రకటించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. సీబీఎస్ఈ విద్యా సంవత్సరం ఇప్పటికే ప్రారంభమైంది. తరగతులు జరుగుతున్నాయి. మొదటి యూనిట్ పరీక్ష కూడా నిర్వహించారు.
ఈ నేపథ్యంలో 9వ తరగతికి త్రిభాషా సూత్రం అమలుపై విద్యావేత్తలు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల సన్నద్ధత, పాఠ్యపుస్తకాల లభ్యతను ప్రశ్నిస్తున్నారు. సీబీఎస్ఈ పునరాలోచన చేయాలని కోరుతున్నారు. హఠాత్తుగా కొత్త విధానం తీసుకురావడం, విద్యార్థులపై అనవసరంగా ఒత్తిడి పెంచడం సరైంది కాదని అంటున్నారు. త్రిభాషా సూత్రం జూలై 1 నుంచి అమల్లోకి వస్తుందని సీబీఎస్ఈ వెల్లడించింది. మూడు భాషల్లో రెండు భారతీయ భాషలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది.
ఏమిటీ త్రిభాషా సూత్రం?
జాతీయ విద్యా విధానం-2020 ప్రకారం విద్యార్థులు మూడు భాషలు అభ్యసించాలి. వీటిలో కనీసం రెండు భారతీయ భాషలు ఉండాలి. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు ఈ త్రిభాషా సూత్రం వర్తిస్తుంది. ఏయే భాషలు బోధించాలన్నది రాష్ట్రాలే నిర్ణయించుకోవచ్చు. ఫలానా భాష కచ్చితంగా ఉండాలన్న బలవంతం ఏమీ లేదు.
మొదట ఎప్పుడు ప్రతిపాదించారు?
త్రిభాషా సూత్రాన్ని తొలుత ఎడ్యుకేషన్ కమిషన్ (కొఠారీ కమిషన్) ప్రతిపాదించింది. 1964 నుంచి రెండేళ్లపాటు ఈ కమిషన్ పనిచేసింది. నేషనల్ పాలసీ ఆన్ ఎడ్యుకేషన్-1968లో దీన్ని చేర్చారు. భాషా వైవిధ్యం, జాతీయ ఐక్యతను ప్రోత్సహించేందుకు త్రిభాషా సూత్రాన్ని ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రభుత్వాలు సమర్థించాయి. 1992లో పి.వి.నరసింహారావు ప్రభుత్వం సవరణ చేసింది. దీనిప్రకారం మాతృభాష లేదా ప్రాంతీయ భాష, దేశ అధికారిక భాష, ఆధునిక భారతీయ లేదా యూరోపియన్

భాషను బోధించాలి.
ఏయే విదేశీ భాషలు?
జాతీయ విద్యా విధానం-2020 ప్రకారం.. మాధ్యమిక స్థాయి విద్యార్థులు భారతీయ భాషలు, ఇంగ్లిష్ తోపాటు కొరియన్, జపనీస్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ వంటి ఇతర విదేశీ భాషలు నేర్చుకోవచ్చు. ఆంగ్లాన్ని ఒక విదేశీ భాషగా వర్గీకరించారు. దీన్నిబట్టి విద్యార్థులు ఇంగ్లిష్ ను, మరో విదేశీ భాషను తమ రెండు మూడో భాషలుగా ఎంచుకోవడానికి వీలుండదు.
పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయా?
ప్రత్యేక ఆర్3 పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి వచ్చే వరకు, 9వ తరగతి విద్యార్థులు తాము ఎంచుకున్న భాషకు సంబంధించిన 6వ తరగతి ఆర్3 పాఠ్యపుస్తకాలను (2026-27 ఎడిషన్) ఉపయోగించుకోవాలని సీబీఎస్ఈ తెలిపింది. తగినంత అర్హత కలిగిన స్థానిక భారతీయ భాషా ఉపాధ్యాయుల కొరతను ఎదుర్కొంటున్న పాఠశాలలు, తాత్కాలిక ఏర్పాటుగా, సంబంధిత భాషలో ప్రావీణ్యం ఉన్న ఇతర సబ్జెక్టుల ఉపాధ్యాయులను నియమించుకోవచ్చని సూచించింది.

అసలు వివాదం ఏమిటి?

గతంలో డీఎంకే నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వానికి, కేంద్రానికి మధ్య రాజకీయ వివాదానికి త్రిభాషా సూత్రం కేంద్ర బిందువుగా మారింది. త్రిభాషా సూత్రాన్ని దశాబ్దాలుగా తమిళనాడు వ్యతిరేకిస్తోంది. త్రిభాషా సూత్రాన్ని అమలు చేయని ఏకైక రాష్ట్రం తమిళనాడు. తమిళంతోపాటు ఇంగ్లిష్‌ను బోధిస్తున్నారు.

జాతీయ విద్యా విధానం–2020 చెప్పిందేమిటి?

పాఠశాల స్థాయి నుండే బహుభాషావాదాన్ని ప్రోత్సహించడానికి త్రిభాషా సూత్రాన్ని త్వరగా అమలు చేయాలని జాతీయ విద్యా విధానం స్పష్టంచేసింది. రాజ్యాంగ నిబంధనలు, ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని, జాతీయ ఐక్యతను పెంపొందించడానికి బహుభాషావాదానికి పెద్దపీట వేయాలని సూచించింది. త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడం కొనసాగిస్తామని పేర్కొంది. అయితే, ఏ ఒక్క భాషను రాష్ట్రాలపై బలవంతంగా రుద్దకూడదని వెల్లడించింది. మూడు భాషల ఎంపికను రాష్ట్రాలకు, విద్యార్థులకే వదిలేయాలని స్పష్టంచేసింది.

యూఏఈ అణువిద్యుత్ కేంద్రం లక్ష్యంగా
డ్రోన్ దాడి



ఈకబురు : యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE)లోని బరాకా అణువిద్యుత్ కేంద్రం లక్ష్యంగా డ్రోన్ దాడి జరిగింది. దీంతో అక్కడున్న విద్యుత్ జనరేటర్ వద్ద మంటలు చెలరేగాయి. ఈ దాడుల్లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అబుధాబీ అధికారులు వెల్లడించారు. రేడియేషన్ సమస్య కూడా తలెత్తలేదన్నారు. మరోవైపు ఈ దాడులకు తామే బాధ్యులమని ఇప్పటివరకు ఎవరూ ప్రకటించుకోలేదు. ఇటీవల యుద్ధ సమయంలో ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ క్షిపణి రక్షణ వ్యవస్థలకు, సైనిక దళాలకు యూఏఈ ఆతిథ్యం ఇచ్చింది. దీనిపై తీవ్ర ఆగ్రహంగా ఉన్న ఇరాన్.. తాజా దాడులకు పాల్పడవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతకుముందు అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేసిన విషయం తెలిసిందే. అమెరికాఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణపై చర్చలు ముందుకు సాగకపోవడం, ప్రతిస్పందనగా ఇరాన్ ఓడరేవులను అమెరికా దిగ్బంధిస్తున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది.

కేంద్రమే డబ్బులు ఇస్తుంటే ధాన్యం
కొనుగోళ్లకు ఇబ్బందేంటి?

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల వరికి కనీస మద్దతు ధర పెంచినా.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతుల ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. 'సర్'పై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. యుద్ధం వల్ల ఇంధనం ధరలు పెరిగితే అప్రజాస్వామికమని సీఎం ఆరోపించడం సరైంది కాదన్నారు. ఆదివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చి మోసం చేసింది. రాష్ట్రంలో కనీసం ధాన్యం కొనలేని పరిస్థితి నెలకొంది. రైతులు అనేక ప్రాంతాల్లో ఆందోళనలు చేస్తున్నారు. యూపీఏ హయాంలో ధాన్యం క్వింటాకు రూ.1,300 గిట్టుబాటు ధర ఉండేది. మోదీ ప్రభుత్వం దాన్ని రూ.2,360కు పెంచింది. ధాన్యం కొనుగోలుకు ప్రతి పైసా కేంద్రమే ఇస్తుంది. రాష్ట్రంపై రూపాయి కూడా భారం పడదు. మొత్తం కేంద్రమే భరిస్తున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లు ఎందుకు ఆలస్యం చేస్తుందో చెప్పాలి. రేవంత్‌రెడ్డి సర్కారు ధాన్యం మీద బోనస్ అని చెప్పి మాట తప్పింది. రాష్ట్ర మంత్రులంతా ఒక్కో జిల్లాకు వెళ్లి కొనుగోళ్లపై దృష్టి పెట్టి రైతుల ఇబ్బందులు తీర్చాలి.
అనర్హుల ఓట్లు కచ్చితంగా తొలగిస్తారు
ఇక స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) విషయానికొస్తే ఒక్కొక్కరికి రెండు లేదా మూడు చోట్ల ఓట్లు ఉంటే గుర్తించి తొలగిస్తారు. ముఖ్యంగా రోహింగ్యాల ఓట్లు కచ్చితంగా తొలగిస్తారు. 'సర్'పై రేవంత్‌రెడ్డి అనేక విమర్శలు చేస్తున్నారు. ఓట్ల ప్రక్షాళన మోదీ వచ్చి చేయరుగా.. రాష్ట్ర అధికారులే చేస్తారు. అయినా రేవంత్‌రెడ్డికి వారిపై విశ్వాసం లేదేమో. ఇటీవల ఒక సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ఓట్లు తొలగిస్తోందని సీఎం రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారు. 'సర్' విషయంలో కేంద్రం కుట్రలు చేయాలని చూస్తోందని ఒక భారాస నేత ఆరోపించారు. అదేంటో బయట పెట్టాలని నేను సవాల్ చేస్తున్నా. పెట్రోల్, డీజిల్‌పై అప్రజాస్వామికంగా ధరలు పెంచారని సీఎం రేవంత్ మాట్లాడుతున్నారు. కానీ ఇది కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉన్న అంశం కాదు. గతంలో అంతర్జాతీయంగా ముడిచమురు ధర తక్కువ ఉన్నప్పుడు ఎక్సైజ్ డ్యూటీని కేంద్రం తగ్గించింది. రాష్ట్రాలను కూడా వ్యాట్ తగ్గించాలని కోరింది. మోదీ విజ్ఞప్తితో అనేక రాష్ట్రాలు తగ్గించాయి కూడా. దేశంలోనే అత్యధికంగా వ్యాట్ విధిస్తోంది తెలంగాణలోనే'' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బండి భగీరథ్ కేసుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు కిషన్‌రెడ్డి బదులిస్తూ.. ఈ కేసులో కేంద్రం ప్రమేయం ఉండదని అన్నారు. రాష్ట్ర పోలీసులకు సంబంధించిన విషయమని, వారే దర్యాప్తు చేసి ఏ విషయమైనా చర్యలు తీసుకునే అధికారం ఉంటుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్య 38కి పెంపు

ఈకబురు,దిల్లీ: సుప్రీం కోర్టు న్యాయమూర్తుల సంఖ్య 34 నుంచి 38కి (ప్రధాన న్యాయమూర్తితో కలిపి) పెరిగింది. న్యాయమూర్తుల సంఖ్య పెంపునకు ఆమోదం తెలుపుతూ ఈనెల 5న కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో దాన్ని కార్యరూపంలోకి తెస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 'ద సుప్రీం కోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) ఎమెండ్‌మెంట్ ఆర్డినెన్స్,2026'ను జారీ చేశారు. ఈ ఏడాది జారీ చేసిన తొలి ఆర్డినెన్స్ ఇదే. ప్రస్తుతం పార్లమెంటు సమావేశాలు లేనందున కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఆచరణలోకి తేవడానికి వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 1950 జనవరి 26వ తేదీన 8 మంది న్యాయమూర్తులతో ప్రారంభమైన సర్వోన్నత న్యాయస్థానం జడ్జీల సంఖ్య 76 ఏళ్లలో సంఖ్యాపరంగా 30, నిష్పత్తి ప్రకారం 375% పెరిగినట్లయింది. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో సుప్రీం కోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) ఎమెండ్‌మెంట్ బిల్లు 2026ను ప్రవేశపెడతారు.

ప్రుడెన్షియల్ చేతికి భారతీ లైఫ్

75% వాటా విలువ రూ.3500 కోట్లు

భారతీ లైఫ్ ఇన్సూరెన్స్‌లో మెజారిటీ (75%) వాటాను యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ప్రుడెన్షియల్ పీఎల్‌సీ కొనుగోలు చేయనుంది. భారతీ లైఫ్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, 360 వన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల నుంచి ఈ వాటాను రూ.3,500 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు ప్రుడెన్షియల్ ఆదివారం తెలిపింది. ఇప్పటికే ఐసీఐసీఐ బ్యాంక్‌తో కలిసి ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ సంస్థను 22% వాటాతో ప్రుడెన్షియల్ నిర్వహిస్తోంది. ఇప్పుడు మరో జీవిత బీమా సంస్థలో మెజారిటీ వాటాను కొనుగోలు చేస్తున్నందున, పాత సంస్థలో వాటాను 10% లోపునకు ప్రుడెన్షియల్ పరిమితం చేసుకోవాల్సి వస్తుంది. ఇందువల్ల లభించే నిధులను (దాదాపు రూ.700 కోట్లను), కొత్త వ్యాపార వృద్ధికి వినియోగిస్తామని పేర్కొంది. భారతీ లైఫ్‌లో వాటాకు సంబంధించి, అనుమతులు లభించాక.. మరిన్ని వివరాలు వెల్లడిస్తామని ప్రుడెన్షియల్ తెలిపింది. ఇంతకుముందు బజాజ్ ఫిన్‌సర్వ్‌తో కలిసి బీమా వ్యాపారాన్ని నిర్వహించిన అలయంజ్ గ్రూప్ తప్పుకోగా, ఇప్పుడు రెండో విదేశీ సంస్థ తమ దీర్ఘకాల భాగస్వామ్యాన్ని వదులుకోవాల్సి వస్తోంది. ఆరోగ్య బీమా సేవల్లోకీ ఈ ఏడాదిలోనే ప్రుడెన్షియల్ ప్రవేశించనుంది. భారతీ గ్రూప్‌నకు ఉన్న పటిష్ఠ వ్యవస్థకు ప్రుడెన్షియల్ అంతర్జాతీయ అనుభవం తోడైతే, దేశ జీవితబీమా రంగంలో కొత్త అవకాశాలను సృష్టించొచ్చని భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతీ మిత్తల్ పేర్కొన్నారు.

అప్పుడు మ్యాగీ.. ఇప్పుడు కిట్‌క్యాట్.. నెస్లేకు మనదే పెద్ద మార్కెట్

దిల్లీ: నెస్లేకు చెందిన చాక్లెట్ కోటెడ్ వేఫర్ బార్ కిట్‌క్యాట్‌కు భారత్ అతిపెద్ద మార్కెట్‌గా అవతరించింది. గడిచిన రెండు మూడేళ్లుగా రెండో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్.. తాజాగా మొదటి స్థానానికి చేరింది. అంటే 85 దేశాల్లో ఈ చాక్లెట్ అమ్ముడవుతుండగా.. అత్యధికంగా విక్రయమయ్యేది మాత్రం మన దేశంలోనే అన్నమాట. వినియోగదారుల నుంచి డిమాండ్, చాక్లెట్‌లో కొత్త ఆవిష్కరణలు, మార్కెటింగ్‌పై పెద్దమొత్తంలో ఖర్చు చేయడం వంటివి ఇందుకు దోహదం చేశాయని నెస్లే తెలిపింది. గడిచిన కొన్నేళ్లుగా నెస్లే కిట్‌క్యాట్‌కు దేశీయంగా మార్కెట్ వాటా క్రమంగా పెరుగుతూ వస్తోందని నెస్లే ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనీశ్ తివారీ అన్నారు. నెస్లే విక్రయించే మ్యాగీకి ఇప్పటికే భారత్ అతిపెద్ద మార్కెట్ కాగా.. ఇప్పుడు కిట్‌క్యాట్ కూడా ఆ జాబితాలో చేరింది. దశాబ్దం క్రితం కిట్‌క్యాట్ మార్కెట్ పరంగా భారత్ పదో స్థానంలో ఉండేది. నెస్లేకు వచ్చే ఆదాయంలో కిట్‌క్యాట్ నుంచి పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతోంది. అటు విలువ పరంగా, సంఖ్యా పరంగా రెండంకెల వృద్ధి నమోదు చేస్తోందని తివారీ పేర్కొన్నారు. భారత్ తర్వాత జపాన్, బ్రెజిల్, యూరప్ కిట్‌క్యాట్‌కు అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నాయని కంపెనీ తెలిపింది.

సీఎన్‌జీ ధర మరోసారి పెంపు

కిట్‌క్యాట్ సెలబ్రేక్, కిట్‌క్యాట్ పాప్స్ వంటి ప్యాక్‌స్‌తో గిఫ్టింగ్ సెగ్మెంట్‌లోకి అడుగుపెట్టామని నెస్లే ఇండియా డైరెక్టర్ జగదీశన్ గోపీ చందర్ ఈ సందర్భంగా తెలిపారు. కిట్‌క్యాట్ డిలైట్స్ పేరుతో ప్రీమియం సెగ్మెంట్‌లోకీ ఎంట్రీ ఇవ్వడం కలిసొచ్చిందని తెలిపారు. ప్రకటన వ్యయం పెంచడం, డిస్‌ప్లే వినియోగించే కమర్షియల్ గ్లాస్ డోర్ రిఫ్రిజిరేటర్లు ప్రోగ్రామ్ కూడా కిట్‌క్యాట్ వృద్ధికి దోహదం చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు ఏటా మ్యాగీ 5 బిలియన్ సర్వ్‌లు విక్రయమవుతున్నట్లు కంపెనీ తెలిపింది. 1930లో కిట్‌క్యాట్‌ను బ్రిటిష్ కంపెనీ రౌన్‌ట్రీ స్థాపించగా.. 1988లో నెస్లే దాన్ని కొనుగోలు చేసింది.

సీఎన్‌జీ ధర మరోసారి పెంపు

సీఎన్‌జీ ధరను కేంద్రం మరోసారి పెంచింది (CNG prices hike). కిలో సీఎన్‌జీపై రూ.1 పెంచుతూ ఆదివారం ప్రకటన చేసింది. కాగా.. రెండ్రోజుల క్రితమే కిలో సీఎన్‌జీపై రూ.2 పెంచిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే మళ్లీ ధరను పెంచడం గమనార్హం. తాజా పెంపుతో దిల్లీలో కిలో సీఎన్‌జీ ధర రూ.80.09గా ఉంది. నొయిడా, ఘాజియాబాద్‌లో రూ.88.70కు చేరింది. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. దీంతో ప్రభుత్వరంగ చమురు కంపెనీలపై ఉన్న ఆర్థిక ఒత్తిళ్లు తగ్గించేందుకు కేంద్రం ఇటీవల దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. లీటరు పెట్రోల్, డీజిల్‌పై సగటున రూ.3 పెరిగింది.

హీరో మోటోకార్ప్ రూ.1500 కోట్ల పెట్టుబడి

ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,500 కోట్ల పెట్టుబడి పెట్టాలని నిర్ణయించినట్లు సంస్థ సీఈఓ హర్షవర్ధన్ చితాలే వెల్లడించారు. తమ స్కూటర్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యమన్నారు. ప్రస్తుతం నెలకు 60,000 స్కూటర్లను తయారు చేస్తుండగా, ఈ సామర్థ్యాన్ని లక్షకు చేరుస్తామన్నారు. విద్యుత్తు స్కూటర్ల తయారీని 50% పెంచుతున్నట్లు వివరించారు. విడిభాగాల తయారీకి దక్షిణ భారతదేశంలో రూ.700 కోట్ల పెట్టుబడి పెడతామన్నారు. పశ్చిమాసియా సంక్షోభ ప్రభావం ప్రస్తుతానికి తమ అమ్మకాలపై ఏమీ లేదని వివరించారు.

అంబుజా సిమెంట్స్ రూ.6500 కోట్లు.... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రాజెక్టుల విస్తరణ కార్యకలాపాలు కొంత నెమ్మదించినట్లు అంబుజా సిమెంట్స్ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.7500 కోట్ల మూలధన పెట్టుబడులు పెట్టగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ.6,0006500 కోట్లకు పరిమితమవుతుందని సంస్థ డైరెక్టర్ కరణ్ అదానీ వెల్లడించారు. కార్యకలాపాలు నిర్వహించే కాంట్రాక్టర్ల ధోరణి వల్లే, పనులు నెమ్మదిస్తున్నాయని పేర్కొన్నారు.

సూచీలను ఉద్రిక్తతలు వదలవా?

శాంతి చర్చలు ఫలించకపోతే ఊగిసలాటే

ఔషధ, లోహ షేర్లకు సానుకూలతలు

ఇంకోసారి ఇంధన ధరల పెంపునకు అవకాశం

శ్లేషకుల అంచనాలు

స్టాక్ మార్కెట్ ఈ వారం

అమెరికాఇరాన్ ఉద్రిక్తతల చుట్టూ ఉన్న అనిశ్చితులు, ముడి చమురు ఆందోళనలు మన స్టాక్ మార్కెట్‌ను వదిలేలా లేవు. శాంతి చర్చలు ఫలవంతం అయితే మినహా, ఈ వారమూ సూచీల ఊగిసలాట తప్పకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. కార్పొరేట్ సంస్థల మార్చి త్రైమాసిక ఫలితాలు బలంగా నమోదవడం.. మార్కెట్‌లో సానుకూల పవనాలు వీచేలా చేయొచ్చని చెబుతున్నారు. ద్రవ్యోల్బణ ప్రభావం వచ్చే 23 త్రైమాసికాల పాటు కనిపించొచ్చని.. స్థూల ఆర్థిక ఒత్తిళ్ల వల్ల మార్కెట్లు స్థిమితపడడానికి 68 నెలల సమయం పట్టొచ్చని విశ్లేషిస్తున్నారు. నిఫ్టీ50 సూచీకి 23,580 పాయింట్ల వద్ద మద్దతు; 23,800 వద్ద నిరోధం కనిపిస్తున్నాయని సాంకేతిక నిపుణులు అంటున్నారు. ఇంధన ధరల పెంపు వచ్చే 23 వారాల్లో మళ్లీ ఉంటుందన్న అంచనాలు కూడా సెంటిమెంటును దెబ్బతీయొచ్చు. విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు ఈ నెలలో ఇప్పటివరకు రూ.27,000 కోట్లు, 2026 ప్రారంభం నుంచి చూస్తే రూ.2.2 లక్షల కోట్లు ఉపసంహరించారు. వారి పెట్టుబడుల ధోరణి, రూపాయి కదలికలూ ప్రభావం చూపుతాయి. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనాలివీ..

ఆరేళ్ల తరవాత వొడాఫోన్ ఐడియా లాభాల్లోకి రావడం, టెలికాం షేర్లపై ప్రభావం చూపొచ్చు. వచ్చే రెండు వారాలకు ఈ రంగ స్క్రిప్‌లపై విశ్లేషకులు సానుకూలంగా ఉన్నారు. నిఫ్టీ ఫార్మా సూచీ లాభాలు కొనసాగొచ్చు. మధ్య, చిన్న స్థాయి ఔషధ షేర్లలో ర్యాలీ ఇందుకు దోహదం చేయొచ్చు. ఈ రంగ సూచీ 23,500 స్థాయి పైన ముగిసినంత కాలం, పడ్డపుడల్లా కొనుగోళ్లు చేపట్టొచ్చు. వాహన షేర్లు నష్టపోవచ్చు. నిఫ్టీ ఆటో సూచీ తిరిగి బలహీన శ్రేణిలోకి జారడం ఇందుకు కారణం. ద్విచక్ర, కార్ల విభాగంలో ఎంపిక చేసిన షేర్ల చార్టుల్లోనూ బలహీనతలున్నాయి. యంత్రపరికరాల షేర్లు మరింత కిందకు వెళ్లొచ్చు. ముడి చమురు ధర పెరగడంతో, ముడి పదార్థాల వ్యయాలు అధికమై.. కంపెనీల మార్జిన్లపై ఒత్తిడి పడొచ్చన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. హర్మూజ్ జలసంధి మూసివేత కొనసాగితే ప్రతికూల ప్రభావం తప్పదని ఈ కంపెనీలు చెబుతున్నాయి. లోహ సూచీ సమీప భవిష్యత్తులో రాణించే అవకాశం ఉంది. లోహ ధరలు స్థిరంగా పెరుగుతుండడంతో, కంపెనీల ఆదాయాలు బాగుంటాయని విశ్లేషకులు అంటున్నారు. లోహ షేర్లు పడ్డపుడల్లా కొనుగోలు చేయొచ్చని బ్రోకరేజీలు పేర్కొంటున్నాయి. సిమెంటు కంపెనీల షేర్లు బలహీనంగా ఉండొచ్చు. ఇంధన, లాజిస్టిక్స్, ముడి పదార్థాల అధిక వ్యయాలను ఈ త్రైమాసికంలో కంపెనీలు భరించనున్నాయి. అల్ట్రాటెక్, దాల్మియా వంటి కంపెనీలు ఉత్పత్తుల ధరలను పెంచాయి కూడా. త్రైమాసిక ఫలితాల నుంచి యుద్ధం వైపు మదుపర్ల దృష్టి మళ్లుతుండడంతో, బ్యాంక్ నిఫ్టీ ఒక శ్రేణికి లోబడి కదలాడొచ్చు. సాంకేతికంగా 53,200 వద్ద మద్దతు, 54,20054,300 వద్ద బలమైన నిరోధం కనిపిస్తోంది. రిటెయిల్ ఇంధన ధరల పెంపు నేపథ్యంలో, ఓఎమ్‌సీల మార్జిన్లకు కాస్త ఊరట కలిగే అవకాశం ఉన్నా, చమురుగ్యాస్ షేర్లు నష్టపోవచ్చు. ఇప్పటికీ లీటరు పెట్రోలుపై రూ.8, లీటరు డీజిల్‌పై రూ.11 నష్టపోతుండడం ఇందుకు కారణం. ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. ముడి చమురు ధర పెరుగుతుండడం, పెట్రోలు, డీజిల్ రిటెయిల్ ధరల పెంపు మరింత ఒత్తిడి తేవొచ్చు. ఈ రంగ షేర్లలో ఇటీవల భారీ దిద్దుబాటు నేపథ్యంలో, తక్కువ నష్టాలే రావొచ్చు. ఐటీ షేర్లు సమీప కాలంలో ఒక శ్రేణికి లోబడి ట్రేడవవచ్చు. గత వారం విక్రయాల నేపథ్యంలో తాత్కాలికంగా కాస్త రికవరీ ఉండొచ్చని విశ్లేషకులు అంటున్నారు. నిఫ్టీ ఐటీ సూచీ 29,750 పైన ఉంటేనే, లాభాల కొనసాగింపునకు అవకాశం ఉంటుంది.

ప్రారంభ స్థాయి ఉద్యోగుల స్థానంలో ఏఐ

అంతర్జాతీయంగా సగం మంది సీఈఓల ధోరణి ఇది

ఆలివర్ వైమాన్- న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీ నివేదిక

కంపెనీల్లో సాధారణ కార్యకలాపాలను కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత టూల్స్ పూర్తి చేస్తుండటంతో, ప్రారంభ స్థాయి ఉద్యోగ నియామకాలు తగ్గిపోతున్నాయి. కంపెనీల నియామకాల విధానంలో భారీ మార్పులకు ఇది కారణమవుతోంది. ఆలివర్ వైమాన్ ఫోరమ్, న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీ నిర్వహించిన అంతర్జాతీయ సర్వే ప్రకారం.. 'తాజా ఉత్తీర్ణులను తీసుకోవడం తగ్గించి, అనుభవజ్ఞులైన ఉద్యోగుల నియామకాలపై దృష్టి పెట్టాలని' ప్రపంచవ్యాప్తంగా దాదాపు సగం మంది సీఈఓలు యోచిస్తున్నారు. పలు రంగాల పరిశ్రమలు, ప్రాంతాలకు చెందిన 415 మంది చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా, 2026 సీఈఓ సర్వే నివేదికను రూపొందించారు. దీని ప్రకారం 43% మంది సీఈఓలు రాబోయే రెండేళ్లలో జూనియర్ స్థాయి కొలువులను తగ్గించాలని భావిస్తున్నారు. 2025లో ఇలా భావించిన వారి సంఖ్య 17 శాతంగా ఉంది. 33% మంది సీఈఓలు మధ్య స్థాయి ఉద్యోగాల భర్తీపై ఎక్కువ దృష్టి పెడుతుండగా, 10% మంది సీనియర్ ఉద్యోగుల నియామకానికి మొగ్గుచూపుతున్నారు.

సాధారణ పనులంటే....

ఫ్రెషర్లు, జూనియర్ ఉద్యోగులకు ఇచ్చే రొటీన్ పనులను, కంపెనీలు ఏఐ టూల్స్ సాయంతో నిర్వహించగలుగుతున్నాయి. కోడింగ్ రాయడం, డాక్యుమెంట్లను విశ్లేషించడం నుంచి కస్టమర్ సపోర్ట్, నివేదికను రూపొందించడం వంటి పనుల కోసం ఇప్పుడు ఏఐను ఎక్కువగా వినియోగిస్తున్నారు.

నిర్ణయాలు తీసుకోవాల్సింది ఉద్యోగులే....

నిర్ణయాలు తీసుకోవడం, వ్యూహాత్మక ఆలోచనలు, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవడంలో ఏఐ ఇంకా సఫలం కావడం లేదు. ఈ పనులకు అనుభవజ్ఞులైన ఉద్యోగుల అవసరం ఉందని ఎగ్జిక్యూటివ్‌లు భావిస్తున్నారు. ప్రాక్టికల్ అనుభవాన్ని, విమర్శనాత్మక ఆలోచనను ఏఐ టూల్‌స్‌తో భర్తీ చేయడం కష్టమని కంపెనీలు గుర్తిస్తున్నాయి.

ఉద్యోగుల సంఖ్య పెరగదా?

రాబోయే 12 ఏళ్లలో ఉద్యోగుల సంఖ్య స్థిరంగా లేదా మార్పులేకుండా ఉంటుందని 45% మంది సీఈఓలు అంచనా వేస్తున్నారు. 25% మంది మాత్రం సిబ్బందిని 5% కంటే ఎక్కువ తగ్గించాలని అనుకుంటున్నారు. మొత్తంగా చూస్తే 75% మంది సీఈఓలు.. నియామకాలను నిలిపివేయడం లేదా సిబ్బందిని తగ్గించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు.

ఏఐ నైపుణ్యాలుంటే..

ఏఐ ద్వారా మంచి ప్రతిఫలాలను పొందుతున్న కొన్ని కంపెనీలు మాత్రం, ఆయా నైపుణ్యాలు కలిగిన యువ ప్రతిభపై నమ్మకం ఉంచుతున్నాయి. ఇటువంటి కంపెనీల్లో 24% మంది సీఈఓలు తాము జూనియర్ ఉద్యోగులకు మొగ్గుచూపుతున్నట్లు తెలిపారు. ఏఐ ద్వారా ఆశించిన స్థాయిలో లాభాలు పొందలేకపోతున్న కంపెనీల్లో ఈ సంఖ్య 17 శాతంగా ఉంది.

రత్నాభరణాల ఎగుమతుల్లో 9% క్షీణత

ముంబయి: ఏప్రిల్‌లో మన దేశం నుంచి రత్నాభరణాల ఎగుమతులు 2.226.45 మిలియన్ డాలర్లు (రూ.20,825.01 కోట్ల)కు పరిమితమయ్యాయి. 2025 ఏప్రిల్ ఎగుమతులు 2,448.53 మిలియన్ డాలర్ల (రూ.20,952.26 కోట్ల) కంటే ఇవి 9.07% తక్కువ. పశ్చిమాసియా సంక్షోభ పరిణామాలే ఇందుకు కారణమని రత్నాభరణాల ఎగుమతుల ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) ఛైర్మన్ కిరిట్ భన్సాలీ వెల్లడించారు. ఏడాది క్రితంతో పోలిస్తే..

కట్ అండ్ పాలిష్ వజ్రాల ఎగుమతులు 1,108.74 మి.డాలర్ల నుంచి 19.65% తగ్గి 890.91 మిలియన్ డాలర్లకు చేరాయి. ల్యాబ్‌లో అభివృద్ధి చేసిన వజ్రాల ఎగుమతులు 110.43 మి.డాలర్ల నుంచి 15.53% క్షీణించి 93.28 మి.డాలర్లకు పరిమితమయ్యాయి. పసిడి ఆభరణాల ఎగుమతులు 1075.67 మి.డాలర్ల నుంచి 21.77% తగ్గి 841.54 మి.డాలర్లుగా నమోదయ్యాయి. ప్లెయిన్ గోల్డ్ ఆభరణాలు 644.33 మి.డాలర్ల నుంచి 47.06% క్షీణించి 341.08 మి.డాలర్లకు చేరాయి. స్టడెడ్ పసిడి ఆభరణాల ఎగుమతులు 431.35 మి.డాలర్ల నుంచి 16.02% పెరిగి 500.46 మి.డాలర్లకు చేరాయి. వెండి ఆభరణాల ఎగుమతులు 49.33 మి.డాలర్ల నుంచి 444% దూసుకెళ్లి 268.38 మి.డాలర్లకు పెరిగాయి.

అమెరికా, ఈశాన్య ఆసియా, లాటిన్ అమెరికా వాటా 35% పైనే

202526 ఆర్థిక సంవత్సరంలో మన దేశ మొత్తం వస్తు ఎగుమతులు 441.78 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇందులో ఉత్తర అమెరికా, ఈశాన్య ఆసియా, లాటిన్ అమెరికా దేశాల మొత్తం వాటా 35 శాతానికి పైగా ఉంది. మన దేశ ఎగుమతుల్లో 97.7 బిలియన్ డాలర్ల (22.1% వాటా)తో ఉత్తర అమెరికా అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈశాన్య ఆసియా (చైనా, జపాన్, దక్షిణ కొరియా, తైవాన్) ఎగుమతులు 21.6% వృద్ధితో 41.6 బి.డాలర్లకు చేరాయి. మొత్తం ఎగుమతుల్లో ఈ ప్రాంత వాటా 9.4 శాతానికి పెరిగింది. లాటిన్ అమెరికాకు ఎగుమతులు 7.8% శాతం పెరిగి 16.4 బి.డాలర్లకు చేరాయి. తూర్పు ఆఫ్రికాకు ఎగుమతులు 13.7% అధికమై 12.6 బి.డాలర్లకు, ఉత్తర ఆఫ్రికాకు 14.8% పెరిగి 8 బి.డాలర్లకు చేరాయి.

దేశీయ తయారీ ఐఏఎఫ్ సీ295 సిద్ధం

భారత రక్షణ రంగ తయారీలో మరో కీలక ముందడుగు పడింది. దేశీయంగా అసెంబుల్ చేసిన సైనిక రవాణా వాహనం ఎయిర్‌బస్ సీ295 విమానం ప్రస్తుతం పరీక్షలకు సిద్ధమైంది. గుజరాత్ వడోదరాలోని టాటా ఎయిర్‌బస్ ప్లాంట్‌లో ఈ విమానాన్ని రూపొందించారు. 'భారత్‌లో తయారీ' కార్యక్రమంలో ఈ ప్రాజెక్టు కీలకం. తద్వారా సీ295 ప్లాట్‌ఫామ్‌కు ప్రపంచంలో అతిపెద్ద వినియోగదారుగా భారత్ అవతరించింది. భారత వాయు దళం (ఐఏఎఫ్) డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ మార్షల్ అవధేష్ కుమార్ భారతి ఇటీవల వడోదరా ప్లాంట్‌లోని ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను సందర్శించి, అక్కడ రూపొందిన సీ295 విమానం పురోగతిని సమీక్షించారు. ఈ విమానంపై క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహించనున్నారు.

56 విమానాలు.. రూ.21,935 కోట్ల ఒప్పందం.....

టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), ఎయిర్‌బస్ మధ్య కుదిరిన ఇండియా స్పెయిన్ సీ295 కార్యక్రమంలో భాగంగా, 2024 అక్టోబరు 28న వడోదరా ప్లాంట్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో కలిసి ప్రారంభించారు. 56 సీ295 విమానాల కోసం స్పెయిన్‌తో రూ.21,935 కోట్ల ఒప్పందాన్ని మనదేశం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం.. 16 విమానాలను నేరుగా ఎగిరే స్థితిలో మనదేశానికి ఎయిర్‌బస్ సరఫరా చేస్తుంది. మిగిలిన 40 విమానాలను మనదేశంలోనే అసెంబ్లింగ్ చేస్తున్నారు.

ఐఏఎఫ్ విమానాల నవీకరణలో సీ295 పాత్ర.....

ప్రతి సీ295 విమానంలో భారత్ ఎలక్ట్రానిక్స్, భారత డైనమిక్స్ అభివృద్ధి చేసిన దేశీయ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సూట్ అమర్చుతున్నారు. ఐఏఎఫ్ దగ్గర ఉన్న ఆవ్రో 748 విమానాలను, ఎయిర్‌బస్ సీ295 విమానాలు భర్తీ చేయనున్నాయి. సైనికుల తరలింపు, సరకుల రవాణా, వైద్య అవసరాలు, ప్రత్యేక ఆపరేషన్‌ల కోసం ఈ విమానాలను వినియోగిస్తారు. ఈ విమానం గరిష్ఠంగా 70 మంది సైనికులను, 48 మంది పారాట్రూపర్లు, 28 మెడికల్ స్ట్రెచర్‌లను తీసుకెళ్లగలదు. రెండు ప్రాట్ అండ్ విట్నీ పీడబ్ల్యూ 127జీ టర్బోప్రాప్ ఇంజిన్లతో ఈ విమానం నడుస్తుంది. తక్కువ దూరం నుంచి టేకాఫ్, ల్యాండింగ్ అయ్యే సామర్థ్యం దీనికి ఉంది. దీంతో సుదూర, పర్వత ప్రాంతాలతో సహా కఠిన ప్రాంతాల్లో, చిన్న రన్‌వేల నుంచి వీటిని నిర్వహించొచ్చు.

దేశీయంగా స్పేస్ ఇంటెలిజెన్స్ శాటిలైట్ల తయారీ!..... అంతరిక్షం ద్వారా ఇంటెలిజెన్స్ కార్యకలాపాలు నిర్వహించేందుకు అనువైన చిన్న శాటిలైట్లను, రక్షణ రంగం కోసం మనదేశంలో తయారు చేయనున్నారు. ఇలాంటి శాటిలైట్ల తయారీలో అంతర్జాతీయంగా ప్రాచుర్యం కలిగిన ఈసీఈవైఈ సంస్థ సీఈఓ రఫాల్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఆసియాపసిఫిక్ ప్రాంతానికి అవసరమైన శాటిలైట్లను భారత్‌లో రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈ తయారీ కార్యకలాపాలను ఏడాది వ్యవధిలోనే చేపడతామని పేర్కొన్నారు. శాటిలైట్లతో పాటు భూమిమీద ఏర్పాటు చేయాల్సిన వ్యవస్థలనూ అందిస్తామన్నారు. ఏడాదికి 10 శాటిలైట్లతో ప్రారంభించి, క్రమంగా 2040కి చేర్చాలన్నది లక్ష్యంగా పేర్కొన్నారు. అంతర్జాతీయంగా తాము ఏడాదికి 50 శాటిలైట్లు తయారు చేస్తున్నట్లు తెలిపారు. పోలాండ్, స్పెయిన్, యూకే, ఆస్ట్రేలియా, జపాన్, యూఏఈ, గ్రీస్, అమెరికాల్లో కలిపి 1,000 మందికి పైగా నిపుణులున్నారని వివరించారు.

గుర్తుండిపోయేలా 'షైతాన్' సీక్వెల్

బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్, జ్యోతిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'షైతాన్'. అతీంద్రియ శక్తుల నుంచి తన కుమార్తెను కాపాడుకోవడానికి ఓ కుటుంబం చేసిన పోరాటం ఆధారంగా దీన్ని తీర్చిదిద్దారు. రెండేళ్ల క్రితం విడుదలై ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న ఈ హారర్ చిత్రానికి సీక్వెల్ రాబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ దీని గురించి ఈ సినిమా నిర్మాత అభిషేక్ పాఠక్ మాట్లాడుతూ.. ఈ కొనసాగింపు చిత్రం ప్రస్తుతం స్క్రిప్ట్ దశలో ఉందని తెలిపారు. "ఏదో ఒక మామూలు హారర్ సినిమా తీసి దానికి 'షైతాన్ 2' అని పేరు పెట్టాలని అనుకోవడం లేదు. 'దృశ్యం' ఫ్రాంచైజీలా గుర్తుండిపోయేలాగా దీన్ని రూపొందించాలని నిర్ణయించుకున్నాం. ఈ సీక్వెల్‌తో పాటు 'రైడ్ 3' కథను కూడా ఎలా ముందుకు తీసుకెళ్లాలి అనే విషయాలపై చర్చలు జరుగుతున్నాయ"ని చెప్పారు. ప్రస్తుతం అజయ్ 'రేంజర్', 'ధమాల్ 4', 'దృశ్యం 3'తో పాటు తదితర చిత్రాలతో బిజీగా ఉన్నారు.

చిరంజీవి కొత్త చిత్రం.. ముహూర్తం కుదిరింది

ఈ సంక్రాంతికి 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమాతో విజయాన్ని అందుకున్నారు కథానాయకుడు చిరంజీవి. ఇప్పుడీ జోష్‌లోనే కొత్త చిత్రం కోసం రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన చేయనున్న ఈ 158వ సినిమాకి బాబీ దర్శకత్వం వహించనున్న సంగతి తెలిసిందే. 'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత వీళ్లిద్దరి కలయికలో రూపొందనున్న రెండో చిత్రమిది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్నారు. ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన ఈ సినిమా.. ఈ నెల 21న పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని చిరు ఆదివారం సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించారు. ఈ మేరకు ఓ వీడియోను అభిమానులతో పంచుకున్నారు. ఈ సినిమాలోని కొత్త లుక్ కోసం ఆయన పడుతున్న కష్టాన్ని.. శరీరాకృతిని మార్చుకునేందుకు చేస్తున్న కఠిన కసరత్తుల్ని ఆ వీడియోలో చూపించారు. మాస్ అంశాలతో నిండిన శక్తిమంతమైన యాక్షన్ కథతో ఈ సినిమా ముస్తాబు కానుంది. చిరు ఇందులో రెండు కోణాల్లో సాగే పాత్రలో అలరించనున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు నుంచే రెగ్యులర్ షూట్ మొదలవుతుందని తెలిసింది. ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి తెరపైకి వచ్చే అవకాశముంది.

కేన్స్‌ లో అదితి మెరుపులు

ఫ్యాషన్, సినీరంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే కేన్స్ చిత్రోత్సవాలు సినీతారల సందడిల మధ్య అంగరంగ వైభవంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలువురు భారతీయ నాయికలు ఈ వేడుకలో తళుక్కున మెరిసి ఆకట్టుకున్నారు. ఇందులో భాగంగానే తాజాగా కథానాయిక అదితీ రావ్ హైదరీ కేన్స్ వేడుకలో అడుగుపెట్టింది. గౌను ధరించి రెడ్‌కార్పెట్‌పై హొయలొలికించి.. సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది అదితి. ఈ నేపథ్యంలోనే 'మేము దీనికి పూర్తిగా అర్హులం. కేన్స్ స్టేట్ ఆఫ్ మైండ్' అనే క్యాప్షన్‌తో దీనికి సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుందామె. ఇక సినిమాల విషయానికొస్తే.. 'ఓ సాథి రే', 'పరివారిక్ మనురంజన్' లాంటి చిత్రాలతో బిజీగా ఉంది అదితి.

కాపాడాలంటే.. మనవాళ్లే కానవసరం లేదు

ఎక్కడైనా ఏదైనా తప్పు జరిగినప్పుడు.. బాధితులను కాపాడాలంటే వాళ్లు మనకు తెలిసిన వారే కానవసరం లేదు. ప్రతి అన్యాయాన్ని ఎదుర్కోవాలని తన కూతురికి జీవిత పాఠాలు నేర్పుతున్నాడో తండ్రి. అందుకు తగ్గట్టుగానే ఆమెకి కరాటే విద్యాబుద్ధులు నేర్పించి మరీ సవాళ్లకు తగ్గట్టుగా సన్నద్ధం చేస్తాడు. మరి ఈ తండ్రీకూతుళ్ల కథేంటో తెలియాలంటే 'బ్లాస్ట్' సినిమా చూడాల్సిందే. అగ్రహీరో అర్జున్, అభిరామి, ప్రీతి ముకుందన్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రమిది. సుభాష్ కె.రాజ్ తెరకెక్కించారు. ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం సినిమా ట్రైలర్‌ను ఆవిష్కరించింది. 'నన్ను చంపితే ఆట అయిపోయినట్టేనా? నీకోసం నాకంటే శక్తిమంతుడైన ఇంకొకడు తప్పకుండా వస్తాడు', 'ఓ సాధారణ హెడ్ మాస్టర్, కుట్టుమిషన్‌పై పనిచేసే తల్లి.. ఇదొక బోరింగ్ ఫ్యామిలీ' లాంటి సంభాషణలతో ఈ ట్రైలర్ అర్జున్‌తో ఏ మాత్రం తీసిపోని విధంగా భార్యా, కూతురు కూడా చేసే యాక్షన్ సన్నివేశాలతో ఆద్యంతం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించేలా ఉంది.

ఒకప్పుడు నాకిష్టం లేదు!

"నా చిన్నప్పుడు కాస్త లావుగా ఉన్నానని సన్నబడమని చెప్పినవాళ్లే.. ఇప్పుడు నాజుగ్గా అయ్యాక గతంలోనే బాగున్నావని అంటున్నారు. అసలు ప్రపంచం ఎలా ఆలోచిస్తుందో కొన్నిసార్లు అర్థం కావట్లేద"ని అంటోంది కథానాయిక కీర్తి సురేశ్. వైవిధ్యమైన పాత్రలతో అలరించే ఆమె.. సర్జరీలు చేయించుకుందంటూ తన లుక్‌పై కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. వీటన్నింటికీ చెక్ పెడుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది కీర్తి. "ఈ విషయం పంచుకోవడానికి ఇదే సరైన సమయం. నేను నా ఫిట్‌నెస్ ప్రయాణం గురించి ఎప్పుడూ పెద్దగా మాట్లాడలేదు. అదే నాకు అతి పెద్ద గురువు. 2013లో నటిగా కెరీర్ ప్రారంభించినప్పుడు ఏమీ తెలియదు. చాలామందిలాగే జిమ్ నా కోసం కాదని అనుకున్నా. కానీ 'మహానటి' తర్వాత ఒక విరామ సమయంలో ఎందుకు దీన్ని ప్రయత్నించకూడదని అనిపించింది. అధిక ప్రోటీన్, తక్కువ కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకోవడం మొదలు పెట్టాను. అలా 9నెలల్లో 10కిలోలు తగ్గాను. కానీ ప్రజలు నన్ను చూసి 'చాలా వీక్ అయిపోయింది', 'సర్జరీలు చేయించుకుంద'ని అన్నారు. నేను నా ముఖానికి, శరీరానికి ఎప్పుడూ సహజమైన పద్ధతులనే పాటిస్తా. అందుకే వారి మాటలు వినగానే బాధ కలిగింది. తర్వాత 2020లో యోగా చేయడం మొదలు పెట్టాక.. నా జీవితంలో చాలా మార్పు వచ్చింది. ఒకప్పుడు నాకు ఇష్టం లేనిది.. ఇప్పుడు అస్సలు వదిలిపెట్టుకోలేనిదిగా మారింది" అని ఆ పోస్ట్‌లో పేర్కొంది.

ఈ మనసుని శూన్యం కమ్ముకోకూడదు

'దృశ్యం' సినిమా ఫ్రాంచైజీతో మరోసారి ప్రేక్షకుల్ని పలకరించడానికి సిద్ధమైపోయారు మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్. ఆయన.. మీనా ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమే 'దృశ్యం 3'. మీనా, సిద్ధిఖీ, ఆశా శరత్, మురళీ గోపీ, ఎస్తేర్ అనీల్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాని ఆంటోనీ పెరుంబవూర్ రూపొందించారు. ఈ నెల 21న రానుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'ఇని వరుమో' అనే గీతాన్ని ఇన్‌స్టా వేదికగా పంచుకుంది చిత్రబృందం. 'భవిష్యత్తు నీడలా చెదిరిపోకూడదు... ఈ మనసుని మళ్లీ శూన్యం కమ్ముకోకూడదు'' అంటూ సాగుతున్న ఈ పాట కుటుంబ సన్నివేశాలతో భావోద్వేగభరితంగా ఉంది. ఇవుగిన్ ఆలపించిన ఈ గీతానికి వినాయక్ శశికుమార్ సాహిత్యమందించారు. ఈ సినిమాలో మోహన్‌లాల్ జార్జి కుట్టి పాత్రలో ప్రేక్షకులకి థ్రిల్ పంచనున్నారు.

వైస్‌కెప్టెన్సీ నుంచి తప్పిస్తారా?

దిల్లీ: అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టు, వన్డే సిరీస్ కోసం సెలక్షన్ కమిటీ మంగళవారం జట్లను ప్రకటించనుంది. టెస్టు జట్టులో పెద్దగా ఆశ్చర్యాలేమీ ఉండకపోవచ్చు. కానీ టెస్టు వైస్‌కెప్టెన్‌గా రిషబ్ పంత్ భవిష్యత్తుపై లోతుగా చర్చ జరిగే అవకాశముంది. 28 ఏళ్ల పంత్‌పై నాయకత్వ పాత్ర ప్రతికూల ప్రభావం చూపిస్తోందన్న భావన పెరుగుతోంది. గత రెండు ఐపీఎల్‌లో సీజన్లలో లఖ్‌నవూ కెప్టెన్‌గా అతడి ప్రదర్శనే ఇందుకు నిదర్శమని అంటున్నారు. గిల్ గైర్హాజరీలో గత నవంబరులో గువాహటిలో దక్షిణాఫ్రికాతో టెస్టులో కెప్టెన్సీ చేసినప్పుడు కూడా పంత్ తన వ్యూహ చతురతను చాటుకోలేకపోయాడు. ''పంత్ లాంటి బ్యాటింగ్ మ్యాచ్ విన్నర్‌ను భారత్ కోల్పోకూడదు. దూకుడైన బ్యాటింగ్‌తో అతడు టెస్టు మ్యాచ్‌ల్లో భారత్‌ను గెలిపించాడు. అయితే అదనపు బాధ్యతలు అప్పగించినప్పుడు బ్యాటింగ్ సమయంలో అతడు సరైన నిర్ణయాలు తీసుకోవట్లేదన్న భావన సెలక్టర్లలో పెరుగుతోంది. బ్యాటర్‌గా అతడికి స్వేచ్ఛగా ఆడే వీలు కల్పించాలని వాళ్లు భావిస్తున్నారు'' అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. పంత్ ప్రస్తుత ఫామ్ కూడా సెలక్టర్లకు తలనొప్పిగా మారింది. ధ్రువ్ జురెల్, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ పోటీలో ఉన్న నేపథ్యంలో వన్డేల్లో రెండో వికెట్ కీపర్‌గా పంత్‌కు అవకాశం దక్కడం కష్టమే. వన్డేల్లో రాహుల్ వికెట్ కీపింగ్ చేస్తున్న సంగతి తెలిసిందే. అఫ్గానిస్థాన్‌తో టీ20 మ్యాచ్‌లు లేనప్పటికీ.. సూర్యకుమార్ యాదవ్ భవిష్యత్తుపై కూడా సెలక్టర్లు చర్చించవచ్చు. రెండేళ్లుగా సూర్య పేలవ ఫామ్‌లో ఉన్నాడు. కోచ్ గంభీర్ ఏం చెబుతాడన్నది కెప్టెన్‌గా సూర్య భవిష్యత్తుకు కీలకం కానుంది. ఒకవేళ కెప్టెన్సీ పోతే ఆటగాడిగానూ సూర్య జట్టులో కొనసాగడం కష్టమే.

బుమ్రా ఆడేనా..!: బీసీసీఐ వైద్య బృందం అనుమతిస్తే... అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టులో బుమ్రా ఆడతాడు. కానీ పని భార నిర్వహణలో భాగంగా వన్డే సిరీస్‌లో అతణ్ని ఆడించే అవకాశం లేదు. ''బుమ్రా పని భారం అనుమతించదగ్గ పరిధిలో ఉందని బీసీసీఐ వైద్య బృందం భావిస్తే అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టులో అతడు ఆడతాడు. కానీ బుమ్రా వన్డే సిరీస్‌లో ఆడే అవకాశం ఏమాత్రం లేదు'' అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. ఐపీఎల్‌లో రాణిస్తున్న ఫాస్ట్ బౌలర్ ప్రిన్స్ యాదవ్ వన్డే జట్టుకు ఎంపికయ్యే అవకాశముంది.

ఆర్సీబీ అడుగేసింది

డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈ ఐపీఎల్‌లోనూ అద్భుత ఆటతీరుతో ఆకట్టుకుంటోంది. ఈసారి ప్లేఆఫ్స్ చేరిన తొలి జట్టుగా ఆర్సీబీ నిలిచింది. హ్యాట్రిక్ విజయం నమోదు చేసిన బెంగళూరు.. మరో మ్యాచ్ మిగిలుండగానే 18 పాయింట్లతో ప్లేఆఫ్స్ బెర్తును చేజిక్కించుకుంది. మరోవైపు పంజాబ్ పరాజయ పరంపర ఆగలేదు. తొలి 7 మ్యాచ్‌ల్లో ఓటమే ఎరుగని శ్రేయస్ సేన.. పరాజయాల్లో డబుల్ హ్యాట్రిక్‌తో ప్లేఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఆ జట్టు ముందంజ వేయాలంటే చివరి మ్యాచ్‌లో నెగ్గి తీరాలి, మిగతా ఫలితాలూ కలిసి రావాలి.

ఐపీఎల్19లో తొలి ప్లేఆఫ్స్ బెర్తు ఖరారైంది. తొమ్మిదో విజయం సాధించిన ఆర్సీబీ ముందంజ వేసింది. ఆదివారం ఆ జట్టు 23 పరుగుల తేడాతో పంజాబ్‌ను ఓడించింది. మొదట వెంకటేశ్ అయ్యర్ (73 నాటౌట్; 40 బంతుల్లో 8×4, 4×6), విరాట్ కోహ్లి (58; 37 బంతుల్లో 4×4, 3×6), దేవ్‌దత్ పడిక్కల్ (45; 25 బంతుల్లో 4×4, 3×6) మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆర్సీబీ 4 వికెట్లకు 222 పరుగులు చేసింది. హర్‌ప్రీత్ బ్రార్ (2/35) ఒక్కడే మెరుగ్గా బౌలింగ్ చేశాడు. ఛేదనలో రసిఖ్ సలామ్ (3/36), భువనేశ్వర్ కుమార్ (2/38)ల ధాటికి తడబడిన కింగ్స్.. 8 వికెట్లకు 199 పరుగులే చేయగలిగింది. శశాంక్ సింగ్ (56; 27 బంతుల్లో 4×4, 4×6), కూపర్ కనోలీ (37; 22 బంతుల్లో 3×3, 3×6)ల పోరాటం సరిపోలేదు. రజత్ పాటీదార్ అందుబాటులో లేకపోవడంతో ఈ మ్యాచ్‌లో ఆర్సీబీకి వికెట్ కీపర్ జితేశ్ శర్మ సారథ్యం వహించాడు.

దెబ్బతీసిన పేలవ ఆరంభం: భారీ ఛేదనలో పంజాబ్ తేలిపోయింది. ఆరంభంలోనే కీలక వికెట్లు కోల్పోవడంతో ఆ జట్టు విజయావకాశాలకు గండిపడింది. ఈ సీజన్‌లో అద్భుతంగా బౌలింగ్ చేస్తున్న భువనేశ్వర్ మరోసారి పవర్ ప్లేలో వికెట్లు తీసి ఆర్సీబీకి అదిరే ఆరంభాన్నిచ్చాడు. తొలి ఓవర్లో ప్రియాంశ్ ఆర్యను డకౌట్ చేసిన అతడు.. మూడో ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ (2)ను పెవిలియన్‌కు పంపాడు. వెంటనే కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (1)ను రసిఖ్ సలామ్ ఔట్ చేయడంతో కింగ్స్ 19/3తో చిక్కుల్లో పడింది. ఈ స్థితిలో కనోలీ, సూర్యాంశ్ షెడ్జే (35; 22 బంతుల్లో 2×4, 2×6) ఇన్నింగ్స్‌ను గాడిన పెట్టే ప్రయత్నం చేశారు. ఆరో ఓవర్లో కనోలీ 4, 6 కొట్టడంతో పవర్ ప్లే ముగిసేసరికి 49/3తో పంజాబ్ కాస్త కోలుకుంది. ఏడో ఓవర్లో కనోలీ ఔటవడంతో స్కోరు వేగం మందగించింది. షాట్ ఆడే ప్రయత్నంలో షెడ్జే కూడా ఔటవడంతో.. 11 ఓవర్లకు పంజాబ్ 93/5తో ఛేదనలో వెనుకబడింది. అయితే శశాంక్, స్టాయినిస్ మళ్లీ పంజాబ్‌లో ఆశలు రేపారు. ముఖ్యంగా శశాంక్ ధాటిగా ఆడాడు. సుయాశ్ వేసిన 13వ ఓవర్లో అతను మూడు సిక్సర్లు బాది 20 పరుగులు రాబట్టాడు. 4 ఓవర్లలో 63 పరుగులు చేయాల్సిన స్థితిలో.. శశాంక్, స్టాయినిస్ దూకుడు కొనసాగిస్తే ఆర్సీబీకి కష్టమయ్యేది. కానీ హేజిల్‌వుడ్.. 17వ ఓవర్లో స్టాయినిస్ (37)ను ఔట్ చేయడమే కాక 7 పరుగులే ఇవ్వడంతో సమీకరణం కష్టంగా మారింది. అజ్మతుల్లా (14)తో కలిసి శశాంక్ పోరాడినా ఫలితం లేకపోయింది. హేజిల్‌వుడ్ 19వ ఓవర్లోనూ కట్టుదిట్టంగా బంతులేసి 7 పరుగులే ఇవ్వడంతో పంజాబ్‌కు దారులు మూసుకుపోయాయి. చివరి ఓవర్లో (రసిఖ్) 33 అవసరమవగా.. రెండో బంతికి శశాంక్ ఔటవడంతో పంజాబ్ పనైపోయింది.

వెంకటేశ్ అదరహో: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు.. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై పరుగుల పంట పండించుకుంది. జాకబ్ బెతెల్ (11) వైఫల్యాన్ని కొనసాగిస్తూ త్వరగా వెనుదిరిగినా.. ఆర్సీబీకి ఇబ్బంది లేకపోయింది. మరో ఓపెనర్ విరాట్ కోహ్లి, పడిక్కల్ ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఎదుర్కొన్న తొలి బంతికే సిక్స్ బాదిన పడిక్కల్.. ఆ తర్వాత కూడా దూకుడు కొనసాగించాడు. కోహ్లి చక్కటి క్రికెటింగ్ షాట్లు ఆడాడు. పవర్‌ప్లే ఆఖరికి ఆర్సీబీ 61/1తో నిలిచింది. తర్వాతి ఓవర్లోనే పడిక్కల్ రెండు సిక్సర్లు, ఒక ఫోర్ బాదడంతో చాహల్ (1/42).. 21 పరుగులు సమర్పించుకున్నాడు. అయితే పదో ఓవర్లో పడిక్కల్‌ను హర్‌ప్రీత్ పెవిలియన్ చేర్చడంతో 76 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వెంకటేశ్‌తో కలిసి కోహ్లి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ సీజన్లో పెద్దగా రాణించలేకపోయిన వెంకటేశ్ అయ్యర్.. క్రీజులో కుదురుకున్నాక చెలరేగాడు. 31 బంతుల్లో అర్ధసెంచరీ (ఈ సీజన్లో నాలుగోది) పూర్తి చేసుకున్న కోహ్లి.. కాసేపటికే ఔటైనా, ఆఖరి ఓవర్లలో వెంకటేశ్ మెరుపులతో ఆర్సీబీ అనుకున్న దాని కంటే ఎక్కువ స్కోరే చేసింది. చాహల్ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన అతను.. ఫెర్గూసన్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు, ఒక ఫోర్ కొట్టాడు. తొలి 10 బంతుల్లో 9 పరుగులే చేసిన వెంకటేశ్.. తర్వాత 19 బంతుల్లోనే 50 మార్క్ అందుకున్నాడు. ఆఖర్లో టిమ్ డేవిడ్ (28; 12 బంతుల్లో 2×4, 2×6) చెలరేగాడు. చివరి 3 ఓవర్లలో ఆర్సీబీ 54 పరుగులు రాబట్టింది.

స్కోరు వివరాలు

కోబెంగళూరు ఇన్నింగ్స్: బెతెల్ (బ) హర్‌ప్రీత్ 11; కోహ్లి (సి) ప్రియాంశ్ (బ) చాహల్ 58; పడిక్కల్ (సి) శ్రేయస్ (బ) హర్‌ప్రీత్ 45; వెంకటేశ్ నాటౌట్ 73; డేవిడ్ (సి) హర్‌ప్రీత్ (బ) అర్‌ష్‌దీప్ 28; ఎక్స్‌ట్రాలు 7,
మొత్తం: (20 ఓవర్లలో 4 వికెట్లకు) 222;
వికెట్ల పతనం: 1-21, 2-97, 3-157, 4-222;
బౌలింగ్: అర్‌ష్‌దీప్ 4-0-43-1; అజ్మతుల్లా 4-0-38-0; హర్‌ప్రీత్ 4-0-35-2; ఫెర్గూసన్ 3-0-43-0; చాహల్ 3-0-42-1; శశాంక్ 2-0-20-0

పంజాబ్ ఇన్నింగ్స్: ప్రియాంశ్ (సి) షెపర్డ్ (బ) భువనేశ్వర్ 0; ప్రభ్‌సిమ్రన్ (సి) పడిక్కల్ (బ) భువనేశ్వర్ 2; కనోలీ (సి) బెతెల్ (బ) షెపర్డ్ 37; శ్రేయస్ (సి) జితేశ్ (బ) రసిఖ్ 1; సూర్యాంశ్ (సి) కోహ్లి (బ) సుయాశ్ 35; స్టాయినిస్ ఎల్బీ (బ) హేజిల్‌వుడ్ 37; శశాంక్ (సి) కోహ్లి (బ) రసిఖ్ 56; అజ్మతుల్లా (సి) డేవిడ్ (బ) రసిఖ్ 14; హర్‌ప్రీత్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 12,
మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) 199;
వికెట్ల పతనం: 1-1, 2-18, 3-19, 4-62, 5-93, 6-160, 7-194, 8-199;
బౌలింగ్: భువనేశ్వర్ 4-0-38-2; హేజిల్‌వుడ్ 4-0-36-1; రసిఖ్ 4-0-36-3; సుయాశ్ 4-0-50-1; షెపర్డ్ 1-0-8-1; కృనాల్ 3-0-27-0

పోరాడి ఓడిన సాత్విక్ జోడీ

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో స్టార్ భారత జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకున్నారు. గొప్పగా పోరాడినప్పటికీ ఫైనల్లో ఈ జంట 12-21, 23-25తో ఇండోనేషియాకు చెందిన లియో రోటీ కర్నాండో, డేనియల్ మార్టిన్ జోడీ చేతిలో ఓడిపోయింది. భారత జోడీ నాలుగు ఛాంపియన్‌షిప్ పాయింట్లను కాచుకున్నా.. చివరికి పరాజయం తప్పలేదు. సాత్విక్, చిరాగ్ ద్వయం తొలి గేమ్‌లో పూర్తిగా తేలిపోయింది. ఆరంభంలో 1-4తో వెనుకబడ్డ ఈ జోడీ ఆ తర్వాత 8-13తో నిలిచింది. ఆధిక్యాన్ని కొనసాగించిన ప్రత్యర్థి జంట పెద్దగా ప్రతిఘటన ఎదుర్కోకుండానే మొదటి గేమ్‌ను గెలుచుకుంది. రెండో గేమ్‌లో మార్టిన్ స్మాష్‌లతో విరుచుకుపడడంతో ఇండోనేషియా జంట 5-3తో ఆధిక్యంలోకి వెళ్లింది. పుంజుకున్న సాత్విక్, చిరాగ్ ద్వయం 7-5తో ఆధిక్యం సంపాదించింది. ఆ తర్వాత 9-9, 14-14, 19-19తో స్కోర్లు సమమయ్యాయి. భారత జోడీ నాలుగు ఛాంపియన్‌షిప్ పాయింట్లను కాచుకున్నా.. ప్రత్యర్థి విజయాన్ని అడ్డుకోలేకపోయింది. "ఈ రోజు తప్ప ఈ టోర్నీలో మా ప్రదర్శన పట్ల సంతృప్తిగా ఉన్నాం. మాకు మంచి ఫలితాలు రావడం మొదలైంది. త్వరలోనే ఓటమి వైపు కాకుండా గెలుపు వైపు ఉంటామని ఆశిస్తున్నా" అని ఫైనల్ అనంతరం సాత్విక్ చెప్పాడు.

రాజస్థాన్ హ్యాట్రిక్ ఓటమి

దిల్లీ అదరగొట్టింది. ఆ జట్టు 5 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌పై విజయం సాధించింది. ధ్రువ్ జురెల్ (53; 40 బంతుల్లో 5×4, 2×6), రియాన్ పరాగ్ (51; 26 బంతుల్లో 3×4, 5×6), వైభవ్ సూర్యవంశీ (46; 21 బంతుల్లో 5×4, 3×6) మెరవడంతో మొదట రాజస్థాన్ 8 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. స్టార్క్ (4/40), మాధవ్ తివారి (2/27), ఎంగిడి (2/24) ఆ జట్టుకు కళ్లెం వేశారు. అభిషేక్ పోరెల్ (51; 31 బంతుల్లో 7×4, 1×6), కేఎల్ రాహుల్ (56; 42 బంతుల్లో 1×4, 3×6), అక్షర్ పటేల్ (34 నాటౌట్; 18 బంతుల్లో 2×4, 2×6) చెలరేగడంతో లక్ష్యాన్ని దిల్లీ 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

దిల్లీ అలవోకగా..: ఛేదనలో ఓపెనర్లు అభిషేక్ పోరెల్, రాహుల్ దిల్లీకి అదిరే ఆరంభాన్నిచ్చారు. సాధికారికంగా ఆడిన ఈ జంట.. చక్కని షాట్లతో అలరించింది. రాజస్థాన్ బౌలర్లపై ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ముఖ్యంగా పోరెల్ ఎక్కువ దూకుడు ప్రదర్శించాడు. 29 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. 10 ఓవర్లలో 105/0తో బలంగా నిలిచింది దిల్లీ. కానీ తర్వాతి ఓవర్లో పోరెల్ నిష్క్రమించడంతో ఇన్నింగ్స్ వేగం మందగించింది. రాహుల్ ధాటిగా ఆడలేకపోయాడు. అతడితో పాటు సాహిల్ వికెట్‌నూ కోల్పోయిన దిల్లీ 11 నుంచి 16 ఓవర్ల మధ్య ఆరు ఓవర్లలో 46 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆ జట్టు 4 ఓవర్లలో 43 పరుగులు చేయాల్సిన స్థితిలో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. 17వ ఓవర్లో స్టబ్స్‌ను ఆర్చర్‌ను ఔట్ చేయడంతో రాజస్థాన్‌లో ఆశలు చిగురించాయి. అయితే 18వ ఓవర్లో మిల్లర్, అక్షర్ చెరో సిక్స్ బాదడంతో 2 ఓవర్లలో దిల్లీకి 19 పరుగులు అవసరమయ్యాయి. తర్వాతి ఓవర్లో మిల్లర్ (9) ఔటైనా.. అశుతోష్ సిక్స్ బాదడంతో 12 పరుగులు వచ్చాయి. జోరు కొనసాగించిన అశుతోష్ (18 నాటౌట్) ఆఖరి ఓవర్ తొలి రెండు బంతుల్లో వరుసగా 4, 6 బాది దిల్లీని విజయ తీరాలకు చేర్చాడు.

రాయల్స్ కట్టడి: అంతకుముందు రాజస్థాన్ భారీ స్కోరు చేసే అద్భుత అవకాశాన్ని చేజార్చుకుంది. 14.1 ఓవర్లలో 161/1తో తిరుగులేని స్థితిలో నిలిచిన ఆ జట్టు.. అనూహ్యంగా తడబడి, పేలవంగా ఇన్నింగ్స్‌ను ముగించింది. స్టార్క్ సూపర్ బౌలింగ్‌తో ఆ జట్టును దిల్లీ కట్టడి చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్.. ఓపెనర్ జైస్వాల్ (12)ను త్వరగానే కోల్పోయింది. కానీ వైభవ్ సూర్యవంశీ ధనాధన్ బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశాడు. ఎదుర్కొన్న తొలి బంతికే సిక్స్ కొట్టిన అతడు.. జోరు కొనసాగించాడు. ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లు దంచేశాడు. త్రిపురన విజయ్ ఓవర్లో మూడు ఫోర్లు, సిక్స్‌తో రెచ్చిపోయాడు. అతడితో పోటీ పడుతూ జురెల్‌కు కూడా చెలరేగడంతో రాజస్థాన్, 7 ఓవర్లలో 86/1తో నిలిచింది. జోరుమీదున్న వైభవ్ తర్వాతి ఓవర్లోనే ఔటైనా.. కెప్టెన్ పరాగ్ విధ్వంసం సృష్టించడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. జురెల్ మరోవైపు నిలవగా, పరాగ్ బ్యాట్ ఝుళిపించాడు. అక్షర్ ఓవర్లో రెండు సిక్స్‌లు బాదిన అతడు.. ముకేశ్ ఓవర్లో వరుసగా 6, 4, 6, 6తో చెలరేగిపోయాడు. పరాగ్ 23 బంతుల్లో, జురెల్ 36 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేశారు. పరుగుల వేగం చూస్తుంటే రాజస్థాన్ తేలికగా 240పై స్కోరు చేసేలా కనిపించింది. కానీ తీవ్రంగా తడబడ్డ ఆ జట్టు కనీసం 200 కూడా దాటలేకపోయింది. రాజస్థాన్ ఆఖరి ఆరు ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి కేవలం 33 పరుగులతో సరిపెట్టుకుంది. స్టార్క్ 15వ ఓవర్లో పరాగ్, ఫెరీరా (0), రవి సింగ్ (4)లను ఔట్ చేసి రాయల్స్ ఇన్నింగ్స్ స్వరూపాన్నే మార్చేశాడు. ఒక్క ఓవర్లోనే మూడు వికెట్లు పోవడంతో ఇన్నింగ్స్ గతి తప్పింది. మిగతా బౌలర్లు కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పరుగుల వేటలో రాజస్థాన్ వెనుకబడింది. చివరి ఆరు ఓవర్లలో ఆ జట్టు ఒక ఫోర్, ఒక సిక్స్ మాత్రమే కొట్టడం గమనార్హం.



'ప్రేక్షకులు లేకుండా IPL మ్యాచ్‌లు నిర్వహించండి'

ఈ సీజన్‌లో మిగిలిన ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రేక్షకులు లేకుండా కొన్ని వేదికల్లోనే నిర్వహించాలని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (CTI) ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్ కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు లేఖ రాశారు. పశ్చిమాసియా సంక్షోభం దృష్ట్యా ఇంధన కొరత ఏర్పడ్డ కారణంగా చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. మరోవైపు జట్ల నిరంతర రాకపోకల వల్ల విమాన ఇంధన (ATF) నిల్వలపై పడే భారాన్ని తగ్గించేందుకు పరిమిత వేదికలను వినియోగించుకోవాలని సూచించారు. ఐపీఎల్ 2026లో మే 16 వరకు 60 మ్యాచ్‌లు జరిగాయి. లీగ్ దశలో మరో 10 మ్యాచ్‌లు జరగనున్నాయి. తర్వాత నాలుగు ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లు ఉంటాయి. మే 26న తొలి క్వాలిఫయర్‌కు ధర్మశాల ఆతిథ్యమివ్వనుంది. ఎలిమినేటర్ మ్యాచ్ (మే 27), క్వాలిఫయర్2 మ్యాచ్ (మే 29) ఛండీగడ్‌లో జరగనున్నాయి. మే 31న అహ్మదాబాద్‌లో ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు.